జైత్ర
మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్

PRGI NO TGTEL/26/A2948
జ్యోతి
# శ్వేత
JYYOTHI SHWETHA
దినపత్రిక

హైదరాబాద్, విజయవాడ ॥సంపుటి:1 ॥ సంచిక: 87॥ శనివారం ॥ 22-8-2026 ॥ పేజీలు: 8 ॥ వెల 3/-

22 ఆగస్టు 2026 - శనివారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - వర్ష ఋతువు శ్రావణ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:04 సూర్యాస్తమయం - సా. 6:33 తిథి దశమి రా. 2:00o వరకు తరువాత ఏకాదశి సంస్కృత వారం స్థిర వాసరః నక్షత్రం జ్యేష్ఠ మ. 2:41 వరకు తరువాత మూల యోగం విష్కంభ ఉ. 6:13o వరకు కరణం తైతుల మ. 12:48 వరకు గరజి రా. 2:00o వరకు వర్జ్యం రా. 11:47 నుండి రా. 1:35 వరకు దుర్ముహూర్తం ఉ. 7:44 నుండి ఉ. 8:34 వరకు రాహుకాలం ఉ. 9:11 నుండి ఉ. 10:45 వరకు యమగండం మ. 1:52 నుండి మ. 3:26 వరకు గుళికాకాలం ఉ. 6:04 నుండి ఉ. 7:37 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:28 నుండి తె. 5:16 వరకు అమృత ఘడియలు తె. 4:55 నుండి ఉ. 6:43 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:54 నుండి మ. 12:44 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున



## అంతరిక్ష రంగ స్టార్టప్‌లతో
# మోదీ భేటీ

### యువ పారిశ్రామికవేత్తల కృషిని ప్రశంసించిన ప్రధాని

దేశ అంతరిక్ష రంగంలో ముందుకు వస్తున్న యువ పారిశ్రామికవేత్తలు, ఆవిష్కర్తలతో ప్రధాని నరేంద్ర మోదీ భేటీ అయ్యారు. భారత అంతరిక్ష రంగానికి కొత్త ఊపును తీసుకొస్తున్న యువశక్తి కృషిని కొనియాడుతూ, భవిష్యత్తులో కూడా కేంద్ర ప్రభుత్వం వారికి పూర్తి మద్దతుగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. అంతరిక్ష రంగంలో అడుగుపెట్టడం సవాళ్లతో కూడుకున్న విషయమని, అయినప్పటికీ యువ పారిశ్రామికవేత్తలు ధైర్యంగా ముందుకు వచ్చి తమ సామర్థ్యాన్ని నిరూపించుకున్నారని ప్రధాని పేర్కొన్నారు. సంస్కరణలపై విశ్వాసం ఉంచి, నిరంతర కృషితో ముందుకు సాగినందువల్లే గత కొన్ని సంవత్సరాల్లో భారత అంతరిక్ష రంగం గణనీయమైన విజయాలు సాధించిందన్నారు.






## ఆక్స్‌ఫర్డ్‌లో తెలంగాణ
# పాలనపై చర్చలు

### ప్రతిష్ఠాత్మక విశ్వవిద్యాలయాన్ని సందర్శించిన ముఖ్యమంత్రి

### బ్లావాట్‌నిక్ స్కూల్‌లో విద్యా విధానాలపై సమావేశం

### ప్రొఫెసర్లతో పాలన, ప్రజా విధానాల చర్చ

తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రపంచ ప్రఖ్యాత ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. దాదాపు తొమ్మిది శతాబ్దాల చరిత్ర కలిగిన ఈ ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలో తెలంగాణ ప్రతినిధి బృందంతో కలిసి పర్యటించారు. ప్రపంచంలోని అత్యంత పురాతన, గౌరవనీయమైన విశ్వవిద్యాలయాల్లో ఒకటిగా పేరుగాంచిన ఆక్స్‌ఫర్డ్‌లో ముఖ్యమంత్రి పర్యటనకు ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది.

ఆక్స్‌ఫర్డ్, ఆగస్టు 21 :పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం పరిధిలోని బ్లావాట్‌నిక్ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్‌ను కూడా సందర్శించారు. ప్రజా పరిపాలన, విధాన రూపకల్పన, నాయకత్వ అభివృద్ధి రంగాల్లో ప్రత్యేక గుర్తింపు పొందిన ఈ విద్యాసంస్థలో తెలంగాణ పాలన, అభివృద్ధి, విద్యా రంగాలకు సంబంధించిన అంశాలపై చర్చలు జరిగాయి. ఈ సందర్భంగా ప్రొఫెసర్ మాయా ట్యూడర్, తరువాయి 2 వ పేజీలో...



# కొండా సురేఖకు షోకాజ్ నోటీసు

### కుమార్తె వ్యాఖ్యలపై వివరణ సమర్పణ

### సీఎం రాక తర్వాత స్పందిస్తానన్న మంత్రి

### కాంగ్రెస్‌లో చర్చనీయాంశమైన వివాదం

### క్రమశిక్షణ చర్యలపై ఉత్కంఠ కొనసాగింపు

**హైదరాబాద్, ఆగస్టు 21 :**

మంత్రి కొండా సురేఖ కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ జారీ చేసిన షోకాజ్ నోటీసుపై మంత్రి కొండా సురేఖ స్పందించారు. ఈ అంశానికి సంబంధించి తాను చెప్పాల్సిన విషయాలన్నింటినీ ఇప్పటికే క్రమశిక్షణ కమిటీకి వివరించానని, ప్రస్తుతం మీడియా ముందు అదనంగా మాట్లాడాల్సిన అవసరం లేదని ఆమె పేర్కొన్నారు. ముఖ్యమంత్రి (మిగతా 2వ పేజీలో)




# పల్లె సమస్యల పరిష్కారానికి పొన్నం భరోసా

### చంతయ్యపల్లిలో ప్రజా పాలన కార్యక్రమం.. ప్రజల వినతులు స్వీకరించిన మంత్రి

### అభివృద్ధి పనులపై అధికారులకు ఆదేశాలు.. రైతులు, గ్రామాల సంక్షేమమే లక్ష్యమని స్పష్టం

హుస్నాబాద్ నియోజకవర్గంలోని భీమదేవరపల్లి మండలం చంతయ్యపల్లిలో నిర్వహించిన "పల్లె పల్లెకు పొన్నం అన్న – పల్లె పల్లెలో ప్రజా పాలన" కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రజలను నేరుగా కలుసుకుని వారి సమస్యలు, అవసరాలను తెలుసుకున్నారు. గ్రామ ప్రజలు అందించిన వినతులను స్వీకరించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజల వద్దకే ప్రభుత్వం వెళ్లి సమస్యలను తెలుసుకోవడం ప్రజాపాలనలో కీలక భాగమని ఆయన పేర్కొన్నారు. గ్రామంలో మౌలిక వసతుల పరిస్థితి, సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై మంత్రి సమగ్రంగా సమీక్ష నిర్వహించారు.

చంతయ్యపల్లి, ఆగస్టు 21: గ్రామ ప్రజలు రహదారులు, తాగునీరు, విద్య, వైద్యం, సాగునీరు వంటి అంశాలపై తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి సమస్యను నమోదు చేసి, ప్రాధాన్యత ఆధారంగా పరిష్కరించే చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువ కావాలన్నదే తమ లక్ష్యమని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా గౌరవెల్లి ప్రాజెక్టు పనులపై కూడా మంత్రి స్పందించారు. ప్రాజెక్టును పూర్తిచేసి కాలువల ద్వారా రైతులకు సాగునీరు అందించేలా చర్యలు వేగవంతం చేస్తున్నామని వెల్లడించారు. సాగునీటి లభ్యత (మిగతా 2వ పేజీలో)



## పెల్లెట్ ఘటనపై
# రాహుల్ ధర్నా

### పోలీసు స్టేషన్‌లో కాంగ్రెస్ ఆందోళన

### ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్

### బాధితుడితో కలిసి ఫిర్యాదు ప్రయత్నం

**న్యూఢిల్లీ, ఆగస్టు 21 :**

జూలై 20న జరిగిన నిరసన కార్యక్రమం సందర్భంగా పెల్లెట్ గాయాల ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ పార్లమెంట్ స్ట్రీట్ పోలీసు స్టేషన్‌లో ధర్నాకు దిగారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న ఆందోళనకారులపై పెల్లెట్ గన్స్ ఉపయోగించారని ఆరోపిస్తూ బాధ్యులపై చర్యలు (మిగతా 2వ పేజీలో)

# సాగునీటి ప్రాజెక్టుల అడ్డంకుల తొలగింపునకు యుద్ధప్రాతిపదికన చర్యలు

### డాక్యుమెంటేషన్ పూర్తయితే ఒకటి, రెండు రోజుల్లోనే పరిహారం కలెక్టర్లకు ఉత్తమ్ ఆదేశం

హైదరాబాద్, ఆగస్టు 21: తెలంగాణలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టులకు అడ్డంకిగా మారిన భూసేకరణ, పునరావాస-పునర్నిర్మాణ సమస్యలను పరిష్కరించేందుకు నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి శుక్రవారం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టారు. డాక్యుమెంటేషన్ పూర్తయిన రైతులకు, నిర్వాసితులకు ఒకటి లేదా రెండు రోజుల్లో పరిహారం అందేలా చూడాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. కలెక్టర్లు, చీఫ్ ఇంజనీర్లు, ఉన్నతాధికారులతో నిర్వహించిన అత్యవసర వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి మాట్లాడుతూ.. భూసేకరణ, (మిగతా 2వ పేజీలో)



## హైదరాబాద్‌లో
# జగన్ పర్యటన

### ఐపీఎస్ అధికారి కుమారుడి వివాహానికి హాజరు

### నూతన వధూవరులకు ఆశీస్సులు

### పార్టీ నేతలతో కలిసి వేడుకల్లో పాల్గొన్న జగన్

హైదరాబాద్, ఆగస్టు 21 : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం హైదరాబాద్‌లో పర్యటించారు. సీనియర్ ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులు కుమారుడి వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ పర్యటన ముందుగానే ఖరారైనట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. హైదరాబాద్‌లోని జలవిహార్ గ్రాండ్ లాన్స్‌లో (మిగతా 2వ పేజీలో)



# నేటి రాశి ఫలాలు

మేషం: కుటుంబ సభ్యుల ప్రవర్తన కొంత నిరుత్సాహపరుస్తుంది. వృధా ఖర్చులు పెరుగుతాయి. ధన పరంగా చేసే ప్రయత్నాలు కలసిరావు. వ్యాపారాలలో శ్రమ పెరుగుతుంది ఉద్యోగమున స్థానచలన సూచనలున్నవి. ఇతరులతో అకారణ విభేదాలు కలుగుతాయి. దైవ కార్యక్రమాల్లో పాల్గొంటారు.

వృషభం: ప్రయాణాలలో ఆర్థిక లాభాలు కలుగుతాయి. ఉద్యోగమున అధికారుల అనుగ్రహంతో ఉన్నత హోదాలు పొందుతారు. ముఖ్యమైన వ్యవహారాలలో స్వంత ఆలోచనలు కలసివస్తాయి. స్థిరాస్తి క్రయ విక్రయాలు లాభసాటిగా సాగుతాయి. ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా ఉంటుంది.

మిధునం: వృత్తి వ్యాపార విస్తరణ ప్రయత్నాలు ఫలిస్తాయి. బంధు మిత్రుల రాకతో గృహమున సందడి వాతావరణం నెలకొంటుంది. సమాజంలో కీర్తి ప్రతిష్టలు పెరుగుతాయి. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఉద్యోగమున పని ఒత్తిడి ఉన్నప్పటికీ సకాలంలో పనులు పూర్తి చేస్తారు.

కర్కాటకం: విలువైన గృహోపకరణాలు కొనుగోలు చేస్తారు. ఆదాయ మార్గాలు పెరుగుతాయి. చాలా కాలంగా వేధిస్తున్న సమస్యల నుండి తెలివిగా బయట పడతారు. అనుకున్న సమయానికి పనులు పూర్తి చేస్తారు. కుటుంబమున శుభకార్య ప్రస్తావన వస్తుంది. వృత్తి ఉద్యోగ విషయంలో అధికారుల సహాయం లభిస్తుంది.

సింహం: వృత్తి వ్యాపారాలలో అధిక కష్టంతో స్వల్ప ఫలితాన్ని పొందుతారు. ఉద్యోగమున అదనపు బాధ్యతలు నిర్వహించడం కష్టం అవుతుంది. కుటుంబ సభ్యులతో మాట పట్టింపులు ఉంటాయి. సంతాన పరంగా ఊహించని సమస్యలు కలుగుతాయి. ఉద్యోగస్తులకు పని ఒత్తిడి అధికమవుతుంది.

కన్య: ఆర్థిక పరంగా ఇబ్బందులు ఉన్నప్పటికీ సౌకర్యాలకు లోటు ఉండదు. విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. నూతన వాహన లాభం కలుగుతుంది. మిత్రుల సహాయంతో కొన్ని పనులు పూర్తిచేస్తారు. నిరుద్యోగ ప్రయత్నాలు సఫలమౌతాయి. స్థిరాస్తి సంబంధిత క్రయ విక్రయాలు లాభసాటిగా సాగుతాయి.

తుల: ముఖ్యమైన ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. చేపట్టిన పనులలో ఆటంకాలు తొలగుతాయి. చిన్ననాటి మిత్రులతో శుభకార్య విషయాలు చర్చిస్తారు. ఆదాయ మార్గాలు పెరుగుతాయి. వృత్తి వ్యాపారాలలో కీలక నిర్ణయాలు తీసుకుంటారు. ఉద్యోగ వాతావరణం అనుకూలిస్తుంది.

వృశ్చికం: ఆదాయానికి మించి ఖర్చులు పెరుగుతాయి. శ్రమాధిక్యతతో కానీ పనులు పూర్తికావు. ఇతరుల వ్యవహారాల్లో జోక్యం చేసుకోకపోవడం మంచిది. భాగస్వామ్య వ్యాపారాలలో విభేదాలు కలుగుతాయి. వృత్తి, ఉద్యోగమున అధికారులు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలి. కుటుంబ పెద్దల అనారోగ్య సమస్యలు భాదిస్తాయి.

ధనస్సు: చేపట్టిన పనులు మందకొడిగా సాగుతాయి. ఉద్యోగ ప్రయత్నాలలో జాప్యం కలుగుతుంది. ఆకస్మిక ప్రయాణాల వలన శారీరక శ్రమ తప్పదు. జీవిత భాగస్వామితో పుణ్య క్షేత్రాలు సందర్శిస్తారు. ఉద్యోగాలలో ఒడిదుడుకులు అధికమవుతాయి. ఋణదాతల నుండి ఒత్తిడి పెరుగుతుంది. ఆలయ దర్శనాలు చేసుకుంటారు.

మకరం: దూర ప్రాంత బంధు మిత్రుల ఆగమనం ఆనందం కలిగిస్తుంది. గృహమున శుభకార్యములు నిర్వహిస్తారు. ముఖ్యమైన వ్యవహారాలు నిదానంగా సాగుతాయి. విద్యార్థులు నూతన విద్యావకాశాలు పొందుతారు. వ్యాపారమున ఆటంకాలు తొలగుతాయి. వృత్తి,ఉద్యోగమున కష్టానికి తగిన గుర్తింపు పొందుతారు.

కుంభం: చేపట్టిన వ్యవహారాలలో స్వల్ప అవాంతరాలు కలుగుతాయి. ఇంటా బయట ఊహించిన సమస్యలు కలుగుతాయి. ప్రయాణాలలో ఆకస్మిక మార్పులు చోటు చేసుకుంటాయి. బంధుమిత్రులు మీ మాటతో విభేదిస్తారు. వ్యాపార వ్యవహారాలలో స్వల్ప ఆటంకాలు ఉంటాయి. వృత్తి ఉద్యోగాలు మందకొడిగా సాగుతాయి.

మీనం: ఆత్మీయుల నుండి కీలక విషయాలు సేకరిస్తారు. పాత మిత్రులతో విహారయాత్రలలో పాల్గొంటారు. చేపట్టిన వ్యవహారాలు సజావుగా సాగుతాయి. నిరుద్యోగులకు శుభవార్తలు అందుతాయి. వృత్తి వ్యాపారాలలో నూతన పెట్టుబడులు అందుతాయి. ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా ఉంటుంది.



# అంతరిక్ష రంగ స్టార్టప్‌లతో మోదీ భేటీ

**న్యూఢిల్లీ, ఆగస్టు 21 (రుద్ర న్యూస్) :**
ఈ సందర్భంగా వివిధ అంతరిక్ష స్టార్టప్‌లు తమ ఆవిష్కరణలు, సాంకేతిక పరిజ్ఞానం, భవిష్యత్ ప్రణాళికలపై ప్రజెంటేషన్లు ఇచ్చాయి. తమ సంస్థలు అభివృద్ధి చెందడంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన అంతరిక్ష సంస్కరణలు కీలక పాత్ర పోషించాయని స్టార్టప్ ప్రతినిధులు ప్రధానికి వివరించారు. అంతరిక్ష రంగంలో ప్రైవేట్ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించే విధానాలు కొత్త అవకాశాలను సృష్టించాయని మోదీ అన్నారు. యువత ప్రతిభ, సాంకేతిక నైపుణ్యాలు దేశాన్ని అంతరిక్ష పరిశ్రమలో మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు. భారత ప్రభుత్వం భవిష్యత్ సాంకేతిక సామర్థ్యాల నిర్మాణంలో స్టార్టప్‌లకు అండగా ఉంటుందని ప్రధాని స్పష్టం చేశారు. పరిశోధన, ఆవిష్కరణలు, వాణిజ్యపరమైన అవకాశాల విస్తరణలో అవసరమైన సహకారం అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రపంచానికి బలమైన, వినూత్నమైన, వాణిజ్యపరంగా విజయవంతమైన అంతరిక్ష నమూనాను అందించే సామర్థ్యం భారత్‌కు ఉందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. యువత ఆధ్వర్యంలో భారత అంతరిక్ష రంగం మరిన్ని విజయాలను నమోదు చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# అమెరికా పర్యటన రద్దు చేసుకున్న సీఎం

## కేంద్ర అనుమతి లభించకపోవడంతో నిర్ణయం

**హైదరాబాద్, ఆగస్టు 21 (రుద్ర న్యూస్) :**
ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం అమెరికా పర్యటన రద్దయింది. కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ అమెరికా పర్యటనకు అనుమతి నిరాకరించిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. యునైటెడ్ కింగ్‌డమ్, అమెరికా దేశాల్లో విద్యా, నైపుణ్యాభివృద్ధి, అంతర్జాతీయ భాగస్వామ్యాల లక్ష్యంతో ఈ పర్యటన ప్రణాళిక రూపొందించబడింది. విధివిధానాలు, ప్రోటోకాల్ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం యూకే, అమెరికా పర్యటనలకు కేంద్ర అనుమతి కోరింది. అయితే తొలుత యూకే పర్యటనకు మాత్రమే అనుమతి లభించింది. అధికారిక ప్రతినిధి బృందం యూకే చేరుకున్న తర్వాత అమెరికా పర్యటనకు అనుమతి ఇవ్వడం లేదని కేంద్రం రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేసింది. దీంతో అమెరికా పర్యటనను రద్దు చేసుకుని లండన్ నుంచే హైదరాబాద్‌కు తిరిగి రావాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. తెలంగాణ అభివృద్ధి, ఉన్నత విద్య, నైపుణ్యాభివృద్ధి, వికసిత్ భారత్ లక్ష్యాల సాధన కోసం రూపొందించిన ఈ పర్యటనకు రాజకీయ కారణాలతో అనుమతి నిరాకరించడం పట్ల ముఖ్యమంత్రి విస్మయం వ్యక్తం చేసినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

# ఆక్స్‌ఫర్డ్‌లో తెలంగాణ పాలనపై చర్చలు

**ఆక్స్‌ఫర్డ్, ఆగస్టు 21 (రుద్ర న్యూస్) :**
పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం పరిధిలోని బ్లావాట్‌నిక్ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్‌ను కూడా సందర్శించారు. ప్రజా పరిపాలన, విధాన రూపకల్పన, నాయకత్వ అభివృద్ధి రంగాల్లో ప్రత్యేక గుర్తింపు పొందిన ఈ విద్యాసంస్థలో తెలంగాణ పాలన, అభివృద్ధి, విద్యా రంగాలకు సంబంధించిన అంశాలపై చర్చలు జరిగాయి. ఈ సందర్భంగా ప్రొఫెసర్ మాయా ట్యూడర్, ప్రొఫెసర్ ఫైసల్ దేవ్జీ తెలంగాణ ప్రతినిధి బృందంతో సమావేశమయ్యారు. తెలంగాణలో అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, పాలనా విధానాలు, విద్యా రంగ సంస్కరణలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలపై అభిప్రాయాల మార్పిడి జరిగింది. అంతర్జాతీయ స్థాయిలో అమలవుతున్న ఉత్తమ విధానాలపై కూడా చర్చించినట్లు తెలిసింది. సమావేశంలో తెలంగాణ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావుతో పాటు పలువురు ఉన్నతాధికారులు, ప్రతినిధులు పాల్గొన్నారు. రాష్ట్ర పరిపాలనలో సాంకేతికత వినియోగం, విద్యా రంగంలో నూతన అవకాశాలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా విధానాల రూపకల్పన వంటి అంశాలపై విస్తృత చర్చలు సాగాయి. ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం మరియు భారతదేశానికి మధ్య చారిత్రక అనుబంధం కూడా ఉంది. మాజీ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ ఈ విశ్వవిద్యాలయంలో విద్యాభ్యాసం చేసిన ప్రముఖ భారతీయ నాయకుల్లో ఒకరు. భారతదేశానికి చెందిన అనేక మంది ప్రముఖులు, విధాన రూపకర్తలు, శాస్త్రవేత్తలు ఈ విశ్వవిద్యాలయంతో అనుబంధం కలిగి ఉన్నారు. తెలంగాణను ప్రపంచ స్థాయి విద్యా, పెట్టుబడి, అభివృద్ధి కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రతినిధి బృందం పేర్కొంది. అంతర్జాతీయ విద్యాసంస్థలతో సహకారం పెంపొందించడం ద్వారా రాష్ట్రంలో విద్యా ప్రమాణాలు, ప్రజా పరిపాలన సామర్థ్యాలను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో ఈ పర్యటన కొనసాగుతోందని అధికారులు వెల్లడించారు.



# ఎల్‌నినో సవాళ్లకు తెలంగాణ సిద్ధం

**హైదరాబాద్, ఆగస్టు 21 (రుద్ర న్యూస్) :**
వర్క్‌షాప్‌లో గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, ఉద్యానవనం, పశు సంవర్ధక, మత్స్య, పంచాయతీరాజ్ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఎల్‌నినోను కేవలం విపత్తుగా కాకుండా ముందస్తు ప్రణాళికతో అవకాశంగా మలుచుకోవాలని మంత్రులు సూచించారు. ప్రతి గ్రామానికి సమగ్ర అభివృద్ధి ప్రణాళిక రూపొందించి, తక్షణ అవసరాలతో పాటు వచ్చే ఐదు నుంచి పది సంవత్సరాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పనులు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. గ్రామస్థాయిలో అన్ని శాఖలు కలిసికట్టుగా పనిచేస్తే మెరుగైన ఫలితాలు సాధ్యమవుతాయని పేర్కొన్నారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ గ్రామాభివృద్ధి ప్రణాళికలు గ్రామసభల నుంచే రూపుదిద్దుకోవాలని తెలిపారు. జీపీఎస్‌ఏపీ కేవలం పత్రం మాత్రమే కాదని, గ్రామ భవిష్యత్తుకు మార్గదర్శకమని చెప్పారు. ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు నీటి సంరక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. రైతులకు అవగాహన కల్పించడంలో క్షేత్రస్థాయి అధికారులు కీలక పాత్ర పోషించాలని పేర్కొన్నారు. మహిళా సంఘ భవనాల నిర్మాణాలను వేగవంతం చేసి త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధి హామీ నిధులను పారదర్శకంగా వినియోగించాలని సూచించారు. నీటి సంరక్షణ పనులు, పంట కుంటలు, ఇంకుడు గుంతలు, చెరువుల అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటికీ లక్షలాది ఎకరాల సాగు భూగర్భ జలాలపైనే ఆధారపడి ఉందని, అందువల్ల నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచే పనులు విస్తృతంగా చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. రైతులను ప్రత్యామ్నాయ పంటల వైపు ప్రోత్సహించాలని, పామాయిల్ సాగు విస్తరణకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్తోందని వివరించారు. మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ దేశం గతంలోనూ అనేకసార్లు ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కొందని గుర్తు చేశారు. కరువు పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు రైతులకు అవగాహన కల్పించడం అవసరమన్నారు. పంటల మార్పిడి, పశుసంపద అభివృద్ధి, చేపల పెంపకం వంటి ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి పెట్టాలని సూచించారు.

చెరువులు, చెక్‌డ్యామ్‌ల ద్వారా వర్షపు నీటిని నిల్వ చేసి భవిష్యత్తు అవసరాలకు వినియోగించుకోవాలని పేర్కొన్నారు. ముందస్తు ప్రణాళికతో తెలంగాణను దేశానికి ఆదర్శంగా నిలపవచ్చని అన్నారు. ఈ సందర్భంగా ప్రతి గ్రామ పంచాయతీకి ప్రత్యేక వెబ్‌సైట్‌ను మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ప్రారంభించారు. గ్రామ జనాభా, వనరులు, అవసరాలు, అభివృద్ధి ప్రణాళికలు, శాఖల వారీగా జరుగుతున్న పనులు వంటి సమగ్ర వివరాలు ఇందులో అందుబాటులో ఉండనున్నాయి. గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిషోర్ మాట్లాడుతూ తెలంగాణలోని అన్ని గ్రామ పంచాయతీల సమాచారాన్ని డిజిటల్ వేదికపై అందుబాటులోకి తీసుకువస్తున్నామని తెలిపారు. గ్రామాలను స్వయం సమృద్ధిగా తీర్చిదిద్దే దిశగా ఈ కార్యక్రమం కీలకంగా నిలుస్తుందని పేర్కొన్నారు.

# పల్లె సమస్యల పరిష్కారానికి పొన్నం భరోసా

మొదటి పేజీ తరువాయి

పెరగడం ద్వారా రైతుల ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందని, వ్యవసాయ ఉత్పత్తి కూడా పెరుగుతుందని అన్నారు. రైతుల అభ్యున్నతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. చంతయ్యపల్లి స్టేజి నుంచి గ్రామం వరకు ఉన్న రహదారిని నెల రోజుల వ్యవధిలో పూర్తి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. గ్రామాభివృద్ధికి రవాణా సదుపాయాలు కీలకమని పేర్కొంటూ రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. అలాగే గ్రామంలో సీసీ రోడ్లు, పంచాయతీ భవనం అభివృద్ధి, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడంలో భాగంగా ఆయిల్‌ఫామ్ సాగును ప్రోత్సహించాలని మంత్రి సూచించారు. రైతులకు అధిక ఆదాయం వచ్చే పంటల వైపు మళ్లించే ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. జల సిరి పథకం ద్వారా ఇంకుడు గుంతలు, ఫామ్ పౌండ్ల నిర్మాణాన్ని విస్తృతంగా చేపట్టి నీటి సంరక్షణకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. దీని ద్వారా భూగర్భ జలాల స్థాయి పెరగడంతో పాటు రైతులకు దీర్ఘకాలిక ప్రయోజనాలు చేకూరుతాయని వివరించారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, అంగన్వాడీ కేంద్రానికి నూతన భవనం నిర్మాణం, గ్రామంలోని అభివృద్ధి పనుల అమలుపై మంత్రి ప్రత్యేక దృష్టి సారించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజల సంక్షేమం, గ్రామాల సమగ్ర అభివృద్ధే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటికి పరిష్కారం చూపడమే నిజమైన ప్రజాసేవ అని పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

# కొండా సురేఖకు షోకాజ్ నోటీసు

(మొదటి పేజీ తరువాయి)

రేవంత్ రెడ్డి విదేశీ పర్యటన ముగించుకుని తిరిగి వచ్చిన తర్వాత ఈ వ్యవహారంపై పూర్తి స్థాయిలో స్పందిస్తానని తెలిపారు. ఇటీవల వరంగల్ జిల్లా గీసుకొండలో జరిగిన కార్యక్రమంలో సుస్మిత చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా పెద్ద చర్చకు దారితీశాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీలో తీవ్ర కలకలం రేపాయి. ఈ వ్యాఖ్యలపై పార్టీ శ్రేణుల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవగా, నాయకత్వం కూడా వాటిని సీరియస్‌గా తీసుకున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ మంత్రి కొండా సురేఖకు షోకాజ్ నోటీసు జారీ చేసింది. నోటీసుకు ప్రతిస్పందనగా ఆమె ఇప్పటికే లిఖితపూర్వక వివరణ సమర్పించినట్లు తెలిసింది. తన కుమార్తె చేసిన వ్యాఖ్యలు పూర్తిగా వ్యక్తిగత అభిప్రాయాలని, వాటికి తనను బాధ్యురాలిగా పరిగణించవద్దని కమిటీ దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. పార్టీ వర్గాల సమాచారం ప్రకారం, ఈ వ్యవహారాన్ని కాంగ్రెస్ రాష్ట్ర నాయకత్వంతో పాటు అధిష్ఠానం కూడా నిశితంగా పరిశీలిస్తోంది. పార్టీ క్రమశిక్షణకు సంబంధించిన అంశంగా భావిస్తూ భవిష్యత్ చర్యలపై చర్చలు జరుగుతున్నట్లు తెలుస్తోంది.

# గవర్నర్‌తో పీఐబీ అధికారుల భేటీ

**హైదరాబాద్, ఆగస్టు 21 (రుద్ర న్యూస్) :**
తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన ఉన్నతాధికారులు లోక్‌భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పత్రికా సమాచార బ్యూరో (పీఐబీ), కేంద్ర సమాచార ప్రసార విభాగం (సీబీసీ) అధికారులు గవర్నర్‌తో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. పీఐబీ, సీబీసీ అదనపు డైరెక్టర్ జనరల్ శృతి పాటిల్ ఈ బృందానికి నాయకత్వం వహించారు. ఆమెతో పాటు పీఐబీ సంయుక్త డైరెక్టర్ డాక్టర్ మానస్ కృష్ణకాంత్, ఇతర ఉన్నతాధికా రులు కూడా సమావేశంలో పాల్గొన్నారు. గవర్నర్‌కు పూల మొక్క అందజేసి మర్యాదపూర్వకంగా అభివాదం చేసిన అధికారులు అనంతరం వివిధ అంశాలపై చర్చలు జరిపారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు సమర్థవం తంగా చేరవేయడంలో సమాచార సంస్థల పాత్రపై ఈ సందర్భం గా అభిప్రాయాల మార్పిడి జరిగినట్లు తెలిసింది. ప్రజలకు సరైన సమాచారాన్ని వేగంగా అందించేందుకు కేంద్ర సమాచార వ్యవస్థ చేపడుతున్న కార్యక్రమాలను అధికారులు గవర్నర్‌కు వివరించి నట్లు సమాచారం.

# సాగునీటి ప్రాజెక్టుల అడ్డంకుల తొలగింపునకు యుద్ధప్రాతిపదికన చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

ఆర్ అండ్ ఆర్, అటవీ అనుమతుల చెల్లింపులను త్వరితగతిన పూర్తి చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే రూ.5,000 కోట్లు మంజూరు చేశారని తెలిపారు. మంజూరైన నిధులు కేవలం కలెక్టర్ల పీడీ ఖాతాల్లో ఉంటే సరిపోదని, నేరుగా బాధితుల ఖాతాల్లోకి చేరాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఇప్పటివరకు రూ.2,782 కోట్లు విడుదల చేయగా, అందులో దాదాపు రూ.566 కోట్లు మాత్రమే లబ్ధిదారులకు అందాయి. మరో రూ.989 కోట్లు పంపిణీ వివిధ దశల్లో ఉండగా, రూ.199 కోట్లు ప్రక్రియ ప్రారంభం కాని జిల్లాల వద్ద ఉన్నాయి. అంటే దాదాపు రూ.1,200 కోట్లను స్వల్ప ప్రక్రియతో తక్షణమే లబ్ధిదారులకు అందజేయవచ్చని మంత్రి పేర్కొన్నారు. నిధుల విడుదల, చెల్లింపుల మధ్య వ్యత్యాసాన్ని ప్రతిరోజూ పర్యవేక్షించాలని సూచించారు. జగిత్యాల జిల్లాలో పరిహార పంపిణీకి వారం రోజుల గడువు కోరగా, ఒకటి లేదా రెండు రోజుల్లోనే పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. సిద్ధిపేట జిల్లాలో మల్లన్నసాగర్ ఫీడర్ కాలువ పనులకు సంబంధించి 180 ఎకరాల భూసేకరణకు సంబంధించిన అవార్డులను వేగవంతం చేయాలన్నారు. మహబూబాబాద్ జిల్లాలోని మున్నేరు–పాలేరు లింక్ కెనాల్ భూసేకరణ, అటవీ అనుమతుల ప్రక్రియపై కూడా స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

# పెల్లెట్ ఘటనపై రాహుల్ ధర్నా

(మొదటి పేజీ తరువాయి)

తీసుకోవాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ పార్లమెంట్ స్ట్రీట్ పోలీసు స్టేషన్ పరిధిలోని డీసీపీ కార్యాలయంలో కొంతసేపు బైఠాయించారు. పెల్లెట్ గాయాలకు గురైన సాహిల్ లోచవ్ అనే యువకుడిని కూడా ఆయన వెంట తీసుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదును స్వీకరించి కేసు నమోదు చేయాలని పోలీసులను కోరారు. సాహిల్ లోచవ్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. పెల్లెట్ గన్స్ వినియోగంపై ఇప్పటివరకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా గానీ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గానీ ఎటువంటి ప్రకటన చేయలేదని విమర్శించారు. ముందుగా 19 ఏళ్ల సాహిల్‌తో కలిసి రాహుల్ గాంధీ మందిర్ మార్గ్ పోలీసు స్టేషన్‌కు వెళ్లినట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. అయితే అక్కడ ఫిర్యాదు స్వీకరించేందుకు నిరాకరించడంతో అనంతరం పార్లమెంట్ స్ట్రీట్ పోలీసు స్టేషన్‌కు వెళ్లినట్లు పేర్కొన్నారు. ఈ ఆందోళన కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీతో పాటు పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు. బాధితుడికి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందని కాంగ్రెస్ నాయకులు స్పష్టం చేశారు. పెల్లెట్ గాయాల ఘటనపై రాజకీయ వర్గాల్లో చర్చ కొనసాగుతున్న వేళ, ఈ అంశంపై అధికారికంగా కేసు నమోదు అవుతుందా లేదా అనే దానిపై ఆసక్తి నెలకొంది.

# శ్వేత

## సంపాదకీయం

**శనివారం 22-8-2026**

# అంధకారంలో విశ్వవిద్యాలయాలు!

"తమసోమా జ్యోతిర్గమయ" నాదంతో చీకటి నుండి వెలుగులోకి నడిపించే జ్ఞాన సరస్వతి కేంద్రాలు విశ్వవిద్యాలయాలు. నాటి నుండి నేటి వరకు చరిత్రను మోస్తూ, భవిష్యత్తును నిర్మిస్తూ గర్వంగా నిలవాల్సిన విశ్వవిద్యాలయాలు నేడు నిర్వీర్యమైపోతున్నాయి. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఒక విశ్వవిద్యాలయ ముఖద్వారం వద్ద ఇలా రాయబడింది. ఏ దేశానైనా నాశనం చేయాలంటే మిస్సైల్స్ కానీ అణుబాంబులు కానీ అవసరం లేదు. నాసిరకం విద్య, విద్యార్థుల్ని పరీక్షలో కాపీ కొట్టనివ్వడం లాంటి విధానాన్ని ప్రోత్సహిస్తే, భవిష్యత్తులో ఆ దేశం దానంతట అదే వినాశనం అవుతుంది. కాబట్టి సమాజ ప్రగతికి విద్య ప్రధానమైనది. దేశ అభివృద్ధి, స్వావలంబన మరియు సమగ్ర ప్రగతిలో విశ్వవిద్యాలయాలు కీలకపాత్ర పోషిస్తాయి. కానీ మన తెలంగాణ స్వరాష్ట్రంలో ప్రభుత్వాలు మారిన విశ్వవిద్యాలయాల విధి రాతలు మారడం లేదు. వీటికి పాలకులే కారకులు.

స్వరాష్ట్రంలో ఉన్న అన్ని విశ్వవిద్యాలయాలలో అధ్యాపక, అధ్యాపకేతర నియామకాలు, నియమిస్తామన్న మాట ఊసే లేకుండా నేడు విశ్వవిద్యాలయాలలో గురువులు లేని విద్య గుడ్డి విద్య అనే నానుడిగా మారింది. ప్రస్తుతం తెలంగాణలో ఓయూ, పాలమూరు, కాకతీయ,శాతావాహన, తెలంగాణ, సురవరం ఆర్జికెటియు, జెఎన్ టి యు, ప్రొఫెసర్ జయశంకర్, వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయలలో దాదాపు 80 నుండి 85% పూర్తిస్థాయి అధ్యాపకులు లేకపోవడం విచారకరం. విశ్వవిద్యాలయాలలో క్షేత్రస్థాయిలో ల్యాబ్స్, గ్రంథాలయాలు, మౌలిక వసతుల కోరతతో విద్యాసంవత్సరాలు ముగిస్తున్నాయే తప్ప పూర్తిస్థాయి సౌకర్యాల ఏర్పాటు శూన్యంగా మాత్రమే ఉంది. పరిశోధనలే ప్రగతికి ప్రామాణికమని భావించే విశ్వవిద్యాలయాలలో పర్యవేక్షకులు లేక పూర్తిస్థాయి పరిశోధనలు కుంటుపడుతున్నాయి. ప్రముఖ పరిశోధకుడు హడ్సన్ మేక్సిన్ అభిప్రాయంలో విశ్వవిద్యాలయాలలో పరిశోధకుల నిరంతరాన్వేషణ సమాజాసర్వతో ముఖాభివృద్ధిలో కీలకమని చెప్పాడు.

నేటికీ కొన్ని విశ్వవిద్యాలయాలు పరిశోధన నోటిఫికేషన్స్ ఊసే లేదు. బడుగు బలహీన వర్గాల విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించాలంటే ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయకపోవడం సర్కారు పని తీరుకు నిదర్శనం. బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు భవిష్యత్తులో ఉన్నత విద్య అందని ద్రాక్షగా కాకుండా తెలంగాణ తొలిదశ, మలిదశ ఉద్యమాలకు పురుడు పోసి, సైద్ధాంతిక బాటలు వేసిన విశ్వవిద్యాలయాలను క్షేత్రస్థాయిలో కాపాడుకోవాల్సిన ప్రస్తుత తరుణంలో మనందరం భాగస్వాములమౌదాం.

**-దండు మోహన్ బాబు**
**రీసెర్చ్ స్కాలర్, ఉస్మానియా విశ్వవిద్యాలయం**

# సుస్మిత వ్యాఖ్యలపై ఎందుకు స్పందించరు

## సంబంధం లేకుంటే ఖండించాలా కదా.. మంత్రి సురేఖపై ఎమ్మెల్యే ఆగ్రహం



హైదరాబాద్,ఆగస్ట్20: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మంత్రి కొండా సురేఖ కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలు పెను దుమారాన్ని రేపుతున్నాయి. సుస్మిత వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిని చేయొద్దని, అది పూర్తిగా ఆమె సొంత అభిప్రాయమంటూ క్రమశిక్షణ కమిటీకి మంత్రి కొండా సురేఖ వివరణ ఇచ్చిన విషయం తెలిసిందే. దీనిపై ప్రభుత్వ విప్‌లు బీర్ల ఐలయ్య, వేముల వీరేశం, ఎమ్మెల్యేలు బాలు నాయక్, నాయిని రాజేందర్ రెడ్డి స్పందిస్తూ.. కొండా సురేఖపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సుస్మిత వ్యాఖ్యలతో సురేఖకు సంబంధం లేకపోతే ఖండించాలని అన్నారు. ప్రభుత్వంపై ప్రతిపక్షాలు విమర్శలు చేయడం మామూలే అని.. సొంత పార్టీ వాళ్లు విమర్శలు చేస్తే ఎలా అని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎత్తిన జెండాను దించకుండా పార్టీని అధికారంలోకి తెచ్చింది రేవంత్ అని.. ఆయనపైన విమర్శలు చేయడమేంటని ప్రశ్నించారు. సుస్మిత వ్యాఖ్యలపై కొండా సురేఖ స్పందించాలని డిమాండ్ చేశారు. కష్టపడుతున్న సీఎంపై బండలేస్తారా అంటూ మండిపడ్డారు. సొంత పార్టీ నేతలే సీఎంపై విమర్శలు చేయడం బాధాకరమని ఐలయ్య అన్నారు. కుమార్తె సుస్మిత వ్యాఖ్యలతో సురేఖకు సంబంధం లేకపోతే ఖండించాలని ప్రభుత్వ విప్ వేముల వీరేశం అన్నారు. కొండా సురేఖ భాష.. పార్టీని ఇబ్బంది పెడుతోందని.. సమంత విషయంలో కూడా ఇలాగే మాట్లాడారని మండిపడ్డారు. 'మీ తప్పుడు భాషకు సీఎం మూల్యం చెప్పించాలా? మీ ఎంటర్టైన్మెంట్ కోసం పార్టీ బలి కావాలా? అధికారంలోకి రావడానికి రేవంత్ చెమట చుక్కలు త్యాగం చేశారు. ముఖ్యమంత్రిని వీక్ చేయాలనే కుట్ర చేస్తున్నారు. పార్టీలో జరుగుతున్న వ్యవహారంపై స్పందిస్తున్నాం. సీఎంపై ఎవరు తప్పుగా మాట్లాడినా చర్యలు తీసుకోవాలి. సీఎం నిర్ణయాలను తప్పు పట్టడం దుర్మార్గం. ఆయన నిర్ణయాలు తప్పు పట్టేవాళ్లు పార్టీలో ఉండాల్సిన అవసరం లేదు. సొంత పార్టీ నేతలు ప్రతిపక్షాలకు గొంతు ఇస్తున్నారు. పార్టీకి, ప్రభుత్వానికి తలనొప్పిగా మారిన వారిని పక్కన పెట్టాలి. పార్టీ వేదికలపై మాట్లాడాల్సిన విషయాలను బహిరంగంగా మాట్లాడతారా? మైక్ దొరికితే ఊగిపోతారా? సీఎంపై అసత్య ఆరోపణలు చేసినా, ఏకవచనంతో మాట్లాడితే ఊరుకోం' అని హెచ్చరించారు. పార్టీకి వ్యతిరేకంగా రాజ్‌గోపాల్ రెడ్డి మాట్లాడినా, బాలు నాయక్ మాట్లాడినా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బాలు నాయక్ అన్నారు. షోకాజ్ నోటీసులు ఇచ్చి అయిపోయిందని అనుకోవద్దని.. కులం, హోదాలతో సంబంధం లేకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్షాల కుట్రను సొంత పార్టీ వాళ్లు అమలు చేస్తున్నారని ఆరోపించారు. సీఎం రేవంత్‌ను బలహీన పర్చాలని చూస్తున్నారని, పార్టీకి వ్యతిరేకంగా ఎవరు మాట్లాడినా పార్టీ నుంచి సస్పెండ్ చేయాలన్నారు. పార్టీ అధికారంలోకి రావడానికి కారణం రేవంత్ అని అన్నారు. ఎన్ని కుట్రలు చేసినా మళ్లీ వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని బాలు నాయక్ ధీమా వ్యక్తం చేశారు. కొండా సురేఖపై ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఏ పార్టీలోకి వెళ్తే ఆ పార్టీని బ్లాక్ మెయిల్ చేస్తున్నారని, ఒక్క ఎమ్మెల్యేతోనైనా సరిగా ఉన్నారా అని ప్రశ్నించారు. కష్టకాలంలో కాంగ్రెస్ పార్టీని వదిలి పోయారని.. వెళ్లేప్పుడు బీఫారంలు తీసుకొని వెళ్లిపోయారని విమర్శించారు. నిరాధార ఆరోపణలు చేసి ప్రతిపక్షాలకు ఆయుధం ఇస్తున్నారన్నారు. ప్రభుత్వంలో ఉంటూ వ్యతిరేకంగా మాట్లాడడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. లక్షలాది మంది త్యాగాన్ని వృధా చేస్తామంటే ఊరుకోమని హెచ్చరించారు. తప్పు చేసిన వారిపై నిర్ణయాలు కఠినంగా తీసుకోవాలన్నారు. కులాన్ని అడ్డుపెట్టుకొని ఏమైనా చేస్తామంటే కుదరదన్నారు. డూప్లికేట్ మనుషులు.. ఒరిజినల్ కాంగ్రెస్ అని మాట్లాడుతున్నారని. ఏమైనా ఉంటే అధిష్ఠానం దగ్గర తీర్చుకోవాలని సూచించారు. పార్లమెంట్‌లో సురేఖ నియోజకవర్గంలో మెజారిటీ తగ్గిందన్నారు. పార్టీ నుంచి బహిష్కరించే ముందే వెళ్లిపోవాలని ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి హితవు పలికారు.



# వరలక్ష్మీదేవిగా అభయమిచ్చిన కనకదుర్గమ్మ

**ఇంద్రకీలాద్రికి పోటెత్తిన భక్తులు**

**పలు ఆలయాల్లో శ్రావణ సందడి**

విజయవాడ,ఆగస్ట్20(ఆర్ఎన్ఎ): శ్రావణ శుక్రవారం వరలక్ష్మి వ్రతం సందర్భంగా ఇంద్రకీలాద్రిపై వెలసిన విజయవాడ కనకదుర్గమ్మ ఆలయానికి భక్తులు పోటెత్తారు. వరలక్ష్మి దేవిగా దుర్గమ్మ దర్శనమిచ్చారు. అమ్మవారికి దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. దీంతో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని అంతరాలయ దర్శనాన్ని ఆలయ అధికారులు రద్దు చేశారు. జై దుర్గా జై జై దుర్గా నామస్మరణతో ఇంద్రకీలాద్రి మారుమోగుతోంది. వరలక్ష్మి వ్రతం సందర్భంగా దుర్గమ్మ ఆలయంతోపాటు

రాష్ట్రంలో పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు అమ్మవారి ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. అలాగే కొన్ని ఆలయాల్లో సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించారు. ద్వారకాతిరుమల కుంకుళ్లమ్మ ఆలయంలో శ్రావణ శుక్రవారం పూజలు నిర్వహించారు. శాకంబరీ దేవి అలంకరణలో కుంకుళ్లమ్మ అమ్మవారు.. భక్తులకు దర్శనమిస్తున్నారు. శ్రావణ శుక్రవారం సందర్భంగా ఆలయంలో ప్రత్యేకంగా చండీ హోమం నిర్వహించారు. భక్తులు.. అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరిస్తున్నారు. భీమవరం మావుళ్లమ్మకు నాలుగు లక్షల గాజులతో అలంకరించారు. శ్రావణ శుక్రవారం, వరలక్ష్మి వ్రతం సందర్భంగా అమ్మవారిని ఆలయ అర్చకులు, అధికారులు ప్రత్యేక అలంకరణ చేశారు. ఇందుకోసం భక్తులు నాలుగు లక్షల గాజులను సమర్పించారు. నెల్లూరు జిల్లాలో శ్రావణ శుక్రవార పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహిళా భక్తులతో ఆలయాలు కిటకిటలాడుతున్నాయి. శ్రావణ శుక్రవారం సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు, విశేషార్చనలు, సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించారు. తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ గుడిలో సామూహిక వరలక్ష్మి వ్రతం నిర్వహించగా.. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అమ్మవారిని గాజులు, వజ్రకిరీటంతో ప్రత్యేకంగా అలంకరించారు. అటు తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయ ఆస్థాన మండపంలో వరలక్ష్మి వ్రతం వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. శ్రావణమాసం రెండో శుక్రవారం సందర్భంగా అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సామూహిక వరలక్ష్మి వ్రతాలు జరిపారు. శ్రీకనకమహాలక్ష్మి, శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయాలకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

# సిఎం అమెరికా పర్యటన రద్దు

**లండన్‌లో పర్యటన ముగించుకుని రానున్న రేవంత్**

హైదరాబాద్,ఆగస్ట్20: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా పర్యటన రద్దయ్యింది. ప్రస్తుతం ఆయన లండన్ పర్యటనలో ఉన్నారు. యూకే నుంచి అమెరికా వెళ్లాల్సిన ఆయన.. అక్కడకు వెళ్లకుండానే పర్యటనను రద్దు చేసుకుని తిరిగి హైదరాబాద్ చేరుకోనున్నట్లు తెలుస్తోంది. ఈనెల 19 నుంచి 30 వరకు పదిరోజుల పాటు విదేశాల్లో సీఎం పర్యటించాల్సి ఉంది. విదేశీ పర్యటనలో భాగంగా బ్రిటన్‌తో పాటు అమెరికాలో ఉన్న ప్రముఖ యూనివర్సిటీలను సందర్శించి విద్యా విధానం, స్కిల్ డెవలప్‌మెంట్ విషయంలో ఆయా దేశాలు ఎలాంటి విధానాలను అవలంబిస్తున్నాయనే దానిపై ముఖ్యమంత్రి అధ్యయనం చేయాల్సి ఉంది. పలు అంతర్జాతీయ యూనివర్సిటీలను సందర్శించే విధంగా షెడ్యూల్‌ను ఖరారు చేశారు.



ప్రస్తుతం లండన్‌లో ఉన్న సీఎం.. అక్కడ ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ, లండన్ బిజినెస్ స్కూల్‌ను సందర్శించాల్సి ఉంది. 23 వరకు లండన్‌లో పర్యటించనున్న సీఎం.. అక్కడి నుంచి అమెరికాలోని బోస్టన్‌కు వెళ్లాల్సి ఉంది. ఈనెల 29 వరకు అమెరికాలో పర్యటించి.. తిరిగి 30న హైదరాబాద్‌కు తిరిగి రావాల్సి ఉంది. అయితే, విదేశీ పర్యటనలకు వెళ్తున్న సందర్భంగా కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతుల కోసం సీఎంవో అధికారులు దరఖాస్తు చేశారు. యూకే పర్యటనకు అనుమతి లభించినప్పటికీ, అమెరికా పర్యటనకు అనుమతి లభించకపోవడంతోనే సీఎం రేవంత్ పర్యటనను రద్దు చేసుకున్నట్లు సమాచారం.





# తొలిరోజు ప్రశాంతంగా సివిల్స్ మెయిన్స్..

## ...పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ...

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సివిల్ సర్వీసెస్ మెయిన్ పరీక్షలు శుక్రవారం విజయవాడ కేంద్రంలో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. నగరంలోని ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్నిజిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ తనిఖీ చేశారు. తొలిరోజు పేపర్-1 ఎస్సే పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించారు. పరీక్షా కేంద్రంలో అభ్యర్థులకు కల్పించిన సౌకర్యాలను పరిశీలించి, అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా ఏర్పాట్లను కొనసాగించాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ మెయిన్ పరీక్షలు ఈ నెల 21వ తేదీ, 22వ తేదీ, 23వ తేదీ, 29వ తేదీ, 30వ తేదీల్లో అయిదు రోజులు పాటు పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. తొలిరోజు మాత్రం ఉదయం సెషన్‌లో మాత్రమే పరీక్ష ఉందని.. మిగిలిన రోజుల్లో ఉదయం, మధ్యాహ్నం కూడా పరీక్షలు జరుగుతాయన్నారు. విజయవాడలోని పరీక్షా కేంద్రంలో 124 మంది అభ్యర్థులకు అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. పరీక్షా కేంద్రంలో నిరంతర విద్యుత్ సరఫరా, తాగునీరు, వైద్య సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లు తదితర అన్ని మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూస్తున్నామన్నారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు సకాలంలో చేరుకునేలా వివిధ ప్రాంతాల నుంచి ప్రత్యేక ప్రజా రవాణా సదుపాయాలను కల్పించామని.. భద్రత పరంగా ప్రత్యేక చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి అన్ని విధాల సహాయ సహకారాలు అందించేందుకు 91549 70454 నంబర్‌తో కంట్రోల్ రూమ్ కూడా సేవలందిస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. లిపరీక్షల తొలిరోజు శుక్రవారం పేపర్ - 1 (ఎస్సే)కు 120 మంది అభ్యర్థులు హాజరుకాగా నలుగురు గైర్హాజరయ్యారు



# మంత్రి నారా లోకేష్ గారి పర్యటన విజయవంతం చేయండి

## మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారి పిలుపు

విజయనగరం, ఆగస్టు 21: రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ శాఖల మంత్రి, యువ నాయకులు నారా లోకేష్ గారి పర్యటనను విజయవంతం చేయాలని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మంత్రి నారా లోకేష్ గారు శనివారం మధ్యాహ్నం విజయనగరం చేరుకుని, విజయనగరం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం 1.30 గంటల నుంచి 3.30 గంటల వరకు నిర్వహించే హెచ్ఆర్‌డీ క్లస్టర్ సమావేశంలో పాల్గొంటారన్నారు. అనంతరం సాయంత్రం 4 గంటల నుంచి 6.30 గంటల వరకు విజయనగరం మండలం చెల్లూరు గ్రామంలో పార్టీ క్యాడర్‌తో సమావేశంలో పాల్గొంటారని ఈ కార్యక్రమాలను జిల్లా ప్రజలు విజయవంతం చేయాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కోరారు.



# రోడ్డు భద్రతలో ఆదర్శ పట్టణంగా విజయవాడను నిలబెడదాం

**ఐడియల్ టౌన్ ఆన్ రోడ్ సేఫ్టీ ప్రాజెక్టుతో లక్ష్యాలను చేరుకుందాం**

**ప్రమాద మరణాలు, క్షతగాత్రులను 10--15 శాతం తగ్గించడమే లక్ష్యంగా చర్యలు**

**నాలుగు కీలక అంశాలతో సమగ్ర రోడ్డు భద్రత కార్యాచరణ**

**జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

రోడ్డు భద్రతలో విజయవాడను ఆదర్శ పట్టణంగా ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమని.. అదేవిధంగా లక్ష్యాల సాధనకు ఐడియల్ టౌన్ ఆన్ రోడ్ సేఫ్టీ కార్యక్రమం దోహదం చేస్తుందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. విజయవాడను రోడ్డు భద్రతలో ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఐడియల్ టౌన్ ఆన్ రోడ్ సేఫ్టీ ప్రాజెక్టుకు సంబంధించిన పోస్టర్లను శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆవిష్కరించారు. హోండా ఇండియా ఫౌండేషన్ సీఎస్ఆర్ భాగస్వామిగా, ట్రాక్స్ -- రోడ్ సేఫ్టీ ఎన్‌జీవో అమలు సంస్థగా ఈ ప్రాజెక్టును చేపడుతున్నాయి. రవాణా, పోలీస్ శాఖల సహకారంతో కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల వల్ల సంభవించే మరణాలు, క్షతగాత్రులను 10--15 శాతం మేర తగ్గించడం, ప్రజల్లో రోడ్డు భద్రతపై బాధ్యతాయుతమైన ప్రవర్తనను పెంపొందించడం ప్రాజెక్టు ప్రధాన లక్ష్యమన్నారు. ఈ ప్రాజెక్టును ప్రధానంగా ఇంజినీరింగ్, ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎడ్యుకేషన్, ఎమర్జెన్సీ కేర్ అనే నాలుగు అంశాల ఆధారంగా అమలు చేయడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా బ్లాక్‌స్పాట్‌లలో మౌలిక వసతుల లోపాలను గుర్తించి సరిచేయడం, జీరో టాలరెన్స్ జోన్ల ద్వారా ట్రాఫిక్ నిబంధనలను కఠినంగా అమలు చేయడం, 105 పాఠశాలలు, 14 కళాశాలల్లో సుమారు 70 వేల మంది విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించడం, హెల్మెట్, సీటుబెల్ట్, లేన్ క్రమశిక్షణ, పాదచారుల భద్రతపై ప్రచారం నిర్వహించడం, అలాగే ప్రమాదాల సమయంలో సకాలంలో ప్రాథమిక సహాయం అందించేందుకు ఫస్ట్ రెస్పాండర్లకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని కలెక్టర్ అన్నారు. రోడ్డు ప్రమాద మరణాలను తగ్గించేందుకు ప్రభుత్వ శాఖలు, పోలీస్, ప్రైవేటు సంస్థలు, విద్యా సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, ఇతర భాగస్వామ్య సంస్థలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి సమన్వయంతో పనిచేయడమే ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో హోండా ఇండియా ఫౌండేషన్ ప్రతినిధులతో పాటు విజయవాడ--ఎన్‌హెచ్‌ఏఐ ప్రాజెక్టు డైరెక్టర్ విద్యాసాగర్, ట్రాక్స్ -- రోడ్ సేఫ్టీ ఎన్‌జీవో (ఢిల్లీ) జనరల్ సెక్రటరీ రజనీ గాంధీ, రీజినల్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎం. వాసు తదితరులు పాల్గొన్నారు.




# ఈ నెల 24న కల్వచర్లలో ఉచిత క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ వైద్య శిబిరం

## ఈ అవకాశాన్ని సద్వినియోగపరచుకోండి

మంథని ఆగస్టు 21:భగవాన్ శ్రీ సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాల సందర్భంగా "మానవ సేవే మాధవ సేవ" అనే భావనతో శ్రీ సత్యసాయి సేవా సంస్థలు--తెలంగాణ ఆధ్వర్యంలో, హైదరాబాద్ యం.ఎన్.జె క్యాన్సర్ హాస్పిటల్ సహకారంతో ఈ నెల 24వ తేదీ సోమవారం ఉదయం 9:30 గంటల నుంచి ఉచిత క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం కల్వచర్ల గ్రామ బస్టాండ్ సమీపంలోని సాయి నిలయం, శ్రీ సత్యసాయి భజన మండలిలో ఈ వైద్య శిబిరం నిర్వహించనున్నారు. 45 సంవత్సరాలు పైబడిన స్త్రీ, పురుషులకు ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ శిబిరంలో పురుషులు, మహిళలకు ఓరల్ క్యాన్సర్ స్క్రీనింగ్, వైద్యుల కన్సల్టేషన్, క్యాన్సర్‌పై అవగాహన, కౌన్సెలింగ్ సేవలు అందించడంతో పాటు మహిళలకు బ్రెస్ట్ స్క్రీనింగ్ (రొమ్ము క్యాన్సర్ నిర్ధారణ), సర్వైకల్ స్క్రీనింగ్ (గర్భాశయ క్యాన్సర్ నిర్ధారణ) పరీక్షలను ఉచితంగా నిర్వహించనున్నారు. క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తిస్తే చికిత్స సులభతరం అవుతుందని, అందువల్ల ప్రజలు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని శ్రీ సత్యసాయి సంస్థల జిల్లా అధ్యక్షులు వెంకటస్వామి, శ్రీ సత్యసాయి భజన మండలి కల్వచర్ల కన్వీనర్ నూక రమేష్ కోరారు. మొదట వచ్చే 150 మందికి మాత్రమే పరీక్షలు నిర్వహించబడతాయి. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 23వ తేదీ ఆదివారం లోపు సాయి నిలయం, శ్రీ సత్యసాయి భజన మందిరం, కల్వచర్లలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.



# తడికలపూడిలో తాగునీటి తిప్పలు వాటర్ ట్యాంకర్లే దిక్కు!

కామవరపుకోట, ఆగస్టు 22:ంతడికలపూడి పంచాయతీ పరిధిలోని ఎస్సీ కాలనీ నాగుల చెరువు గట్టు వద్ద ఉన్న మంచినీటి మోటార్ కేబుల్ వైరు పాడై సుమారు పది రోజులు గడుస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో తాగునీటి ఎద్దడి తీవ్రరూపం దాల్చింది. నీటి సరఫరా నిలిచిపోవడంతో కాలనీవాసులు నీటి కోసం తీవ్ర అవస్థలు పడుతున్నారు. మోటార్ పునరుద్ధరణకు నానాటికీ ఆలస్యం అవుతుండటంతో, పంచాయతీ సరఫరా చేసే వాటర్ ట్యాంకర్ల వద్ద లేదా స్వచ్ఛందంగా తెప్పించే ట్యాంకర్ల వద్ద పెద్ద ఎత్తున బిందెలు, డ్రమ్ములు పట్టుకుని క్యూ లైన్లలో నిలబడాల్సిన దుస్థితి ఏర్పడింది. గంటల తరబడి కాచి ఉండి వాటర్ ట్యాంకర్ల నుండి నీటిని పట్టుకుంటూ కాలనీ ప్రజలు తీవ్ర నరకయాతన అనుభవిస్తున్నారు. ఈ సమస్యను పది రోజులుగా పరిష్కరించకుండా నిర్లక్ష్యం వహించడంపై పంచాయతీ అధికారుల తీరుపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, మోటార్ కేబుల్‌ను బాగు చేయించి పైప్‌లైన్ ద్వారా తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# మహిళల ఆర్థిక స్వావలంబనకు 'రైజ్' కార్యక్రమం చుక్కానిలా నిలుస్తుంది

**శిక్షణలో పొందిన నైపుణ్యాలను ఉపాధి, స్వయం ఉపాధిగా మలుచుకోవా**

**లిమహిళలు ఆర్థికంగా బలపడితే కుటుంబానికి వెన్నుదన్నుగా నిలుస్తారు**

విజయవాడ: ఆగస్టు 21, 2026. మహిళలు శిక్షణ ద్వారా పొందిన నైపుణ్యాలు, అనుభవాన్ని వినూత్న ఆలోచనలతో మేళవించి వివిధ ఉత్పత్తులను తయారు చేసి, వాటిని మార్కెటింగ్ చేసుకోవడం ద్వారా ఆర్థికంగా ఎదిగేందుకు 'రైజ్' కార్యక్రమం చుక్కానిలా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అన్నారు ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లి రైజ్ కేంద్రంలో నిర్వహించిన క్రాఫ్ట్ అండ్ ఆర్ట్స్ సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్ మినీ ఎక్స్‌పోను శనివారం జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ ఢిల్లీ నుండి వచ్చిన ఓడిఓపి అధికారి ఇషాదీప్ సింగ్ తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ, ప్రస్తుత సమాజంలో ప్రతి మహిళ తనకంటూ ఒక నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకుని స్వశక్తితో ఎదగాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. మహిళ ఆర్థికంగా బలపడినప్పుడు కుటుంబానికి ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలవడంతో పాటు, కుటుంబ జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుత జీవనశైలి అధిక ఖర్చులతో ముడిపడి ఉందని, కుటుంబ అవసరాలు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో మహిళలు తమకు ఆసక్తి ఉన్న రంగంలో ఏదో ఒక పనిని ఉపాధిగా లేదా వ్యాపకంగా చేపట్టి ఆర్థికంగా ఎదగాలని కలెక్టర్ సూచించారు. మహిళల కలలను కార్యరూపంలోకి తీసుకురావడానికి ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా కోట్లాది రూపాయల రుణాలను అందిస్తోందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకుని మహిళలు చిన్నతరహా వ్యాపారాలను ప్రారంభించడంతో పాటు, తాము నేర్చుకున్న నైపుణ్యాలకు అనుగుణంగా ఉత్పత్తులను తయారు చేసి విక్రయించడం ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకోవచ్చన్నారు. ప్రతి మహిళ ఏదో ఒక నైపుణ్యాన్ని కలిగి ఉండేలా రైజ్ కేంద్రంలో వివిధ రకాల శిక్షణా కోర్సులను నిర్వహిస్తున్నామని తెలిపారు. శిక్షణ పొందిన మహిళలు కేవలం శిక్షణతో ఆగిపోకుండా, తమ నైపుణ్యాలను ఉత్పత్తుల తయారీ, మార్కెటింగ్, బ్రాండింగ్ తదితర అంశాలతో అనుసంధానం చేసుకుని స్వయం ఉపాధి దిశగా ముందుకు సాగాలని సూచించారు. మహిళలు తయారు చేసిన ఉత్పత్తుల వివరాలను అడిగి తెలుసుకున్న ఆయన, వాటి ఉత్పత్తి వ్యయం, విక్రయ ధర, మార్కెటింగ్ విధానం, బ్రాండింగ్, ఉత్పత్తులకు లభిస్తున్న ఆదరణ తదితర అంశాలపై మహిళలతో చర్చించారు. ఉత్పత్తుల నాణ్యతను మరింత మెరుగుపరచడంతో పాటు, వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా కొత్త ఉత్పత్తులను రూపొందించాలని సూచించారు. మంచి ఉత్పత్తి తయారీతో పాటు దానికి సరైన మార్కెటింగ్, ఆకర్షణీయమైన ప్యాకేజింగ్, బ్రాండింగ్ ఎంతో ముఖ్యమని కలెక్టర్ పేర్కొన్నారు. రైజ్ కేంద్రం ద్వారా అందిస్తున్న శిక్షణా కార్యక్రమాలను మహిళలు సద్వినియోగం చేసుకుని తమలోని ప్రతిభను వెలికితీసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. శిక్షణ ద్వారా పొందిన నైపుణ్యాలను ఆదాయ వనరులుగా మార్చుకుని, కుటుంబ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడంతో పాటు స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకునే స్థాయికి మహిళలు ఎదగాలని ఆకాంక్షించారు. మహిళలకు అవసరమైన శిక్షణ, మార్గదర్శకత్వం, ఆర్థిక సహకారం అందించడం ద్వారా వారిని స్వయం ఉపాధి దిశగా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న




చర్యలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు, రైజ్ మేనేజర్ బి. తేజస్విని, డీఆర్‌డీఏ సిబ్బంది, రైజ్ కేంద్రం సిబ్బంది, శిక్షణ పొందిన మహిళలు తదితరులు పాల్గొన్నారు.



# యువతలో పారిశ్రామిక ఆలోచనలకు బాటలు

## ఆర్‌టీఐహెచ్‌లో ఐదు రోజుల శిక్షణా శిబిరం ముగింపు

రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ (ఆర్‌టీఐహెచ్), విజయవాడ--ఎనికేపాడు ఆధ్వర్యంలో ఆగస్టు 17 నుంచి 21 వరకు నిర్వహించిన ఐదు రోజుల పారిశ్రామికవేత్తల శిక్షణా శిబిరం శుక్రవారం విజయవంతంగా ముగిసింది. ప్రపంచ పారిశ్రామికవేత్తల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిక్షణా శిబిరంలో పీబీ సిద్ధార్థ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ విద్యార్థులతో పాటు సుమారు 100 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పారిశ్రామిక ఆలోచనా విధానం, సమస్యలను గుర్తించడం, వినూత్న పరిష్కారాలను రూపొందించడం, వ్యాపార ఆలోచనలను అభివృద్ధి చేయడం వంటి అంశాలపై వారికి అవగాహన, శిక్షణ అందించారు. కార్యక్రమంలో భాగంగా 21 వినూత్న వ్యాపార ఆలోచనలను విద్యార్థులు నిపుణుల ముందు ప్రదర్శించారు. పౌర సేవలు, ప్రజా రవాణా, ఆరోగ్యం, స్వచ్ఛమైన తాగునీరు, వ్యవసాయం తదితర రంగాలకు సంబంధించిన ఆలోచనలను విద్యార్థులు వివరించారు. నిపుణులు విద్యార్థులకు విలువైన సూచనలు, మార్గదర్శకత్వం అందించారు. ఈ సందర్భంగా ఆర్‌టీఐహెచ్ విజయవాడ ముఖ్య కార్యనిర్వహణ అధికారి లిలిడా. హరి బాబులిలి మాట్లాడుతూ యువతలో సృజనాత్మక ఆలోచనలు, ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు ఆర్‌టీఐహెచ్ అందిస్తున్న అవకాశాలను వివరించారు. వినూత్న ఆలోచనలను ఆచరణలోకి తీసుకువచ్చి భవిష్యత్‌లో పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని విద్యార్థులకు సూచించారు. ఐదు రోజుల శిక్షణా శిబిరం విద్యార్థులకు ఆవిష్కరణలు, పారిశ్రామిక ఆలోచనలు, శిక్షణ, మార్గదర్శకత్వానికి మంచి వేదికగా నిలిచింది. కార్యక్రమం విజయవంతం కావడంలో ఆర్‌టీఐహెచ్ సిబ్బంది, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు చురుకుగా పాల్గొన్నారు.




# కీర్తించుకోవడానికే మంత్రులను తీసుకువచ్చిన దుద్దిళ్ల శ్రీధర్...

**ఇంకా అబద్దాలపైనే జీవిస్తున్న మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల**

**పదిశాతం రోడ్డు పూర్తి చేయకుండా అభివృద్ధి అనడం సిగ్గు చేటు**

**రెండేళ్లుగా అభివృద్ధి పనులు ఎందుకు చేయలేదో జవాబు చెప్పాలే**

**ప్రెస్‌మీట్‌లో మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్**

మంథని ఆగస్టు 21; ఈ ప్రాంత ప్రజల ముందు తనను కీర్తించుకోవాలనే ఉద్దేశ్యంతోనే మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ నలుగురు మంత్రులను తీసుకువచ్చి కోట్ల రూపాయాలను వృదా చేశాడని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ తీవ్ర స్థాయిలో విమర్శించారు. శుక్రవారం మంథని పట్టణంలోని రాజగృహాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 80వ స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకుంటున్న క్రమంలో ఎనిమిదిసార్లు ఒకే కుటుంబానికి ఓట్లు వేసి గెలిపించారని, ఒకే వ్యక్తికి ఐదుసార్లు అవకాశం కల్పిస్తూ మూడోసారి మంత్రి అయి అబద్దాలు,మోసాలు, ప్రజలకు అన్యాయం, మంథనికి అపకీర్తి తీసుకురావడమే మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ళ శ్రీధర్ సాదించిన ఘనకీర్తి అని ఎద్దేవా చేశారు. అధికారంలోకి వచ్చి మూడేళ్లు దగ్గరికి వస్తున్నా దుద్దిళ్ల శ్రీధర్ ఇంకా అబద్దాలపైనే జీవిస్తున్నాడని, ఇది ప్రజాస్వామ్యానికే అవమానమన్నారు. మంథని నియోజకవర్గ ప్రజల కోసం ఒక్కశాతం ఆలోచన చేయకుండా కేవలం తనను కీర్తించుకోవడానికే నలుగురు మంత్రులను తీసుకువచ్చి అభివృద్ధి పనుల పేరిట శిలాఫలకాలు వేశారని ఆయన విమర్శించారు. సమాజాన్ని అమాయకులను చేసి ఆలోచన లేకుండా చేసి భారత రాజ్యాంగం, అంబేద్కర్‌ను కనబడకుండా చేసి 40ఏండ్లు దుద్దిళ్ల కుటుంబం అనుభవిస్తుందన్నారు. ఆనాడు మంథనికి న్యాక్ సెంటర్‌కు ఫౌండేషన్ వేస్తున్నం, జీఓ తీసుకువచ్చినం అని చెప్పితే 20ఏండ్ల క్రితమే జీవన్‌రెడ్డి తీసుకువచ్చాడని, నీవు ఆలస్యంగా తీసుకువచ్చావు అవమానపడు అని చెప్పామన్నారు. తాము పెద్దపల్లి కాటారం వరకు రోడ్డు నిర్మాణం కోసం డీఎంఎఫ్‌టీ నిధులు మంజూరీ చేశామని, 90శాతం రోడ్డు పనులు పూర్తి కాగా కేవలం 10శాతం మిగిలిపోతే కనీసం ఆ మిగిలిన రోడ్డు పనులు పూర్తి చేయించలేని సన్నాసి మంథని ఎమ్మెల్యే అని ఆయన అన్నారు. 2024లో పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ముఖ్యమంత్రితో కలిసి అనేక అభివృద్ధి పనులకు శిలాఫలకాలు వేశారని, ఆర్‌అండ్‌బీ గెస్టహౌజ్, గంగాపురి పోతారం 5కోట్లతో సబ్‌స్టేషన్, గోదావరి నది వద్ద బ్రిడ్జి, నస్తూరిపల్లిలో వంద కోట్లతో సభ పెట్టి ఆరెంద కాడ బ్రిడ్జ అన్నరు ఇలా అనేక పనులు చెప్పి ఇప్పటికే అందులో ఏ ఒక్కటి మొదలు కాలేదని, పనులు ఎందుకు మొదలు పెట్టలేదో దుద్దిళ్ల శ్రీధర్ జవాబు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలో సంపాదించే వారిలో ముఖ్యమంత్రి తర్వాత మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ అని అందరూ చెప్తున్నారని మా ప్రజల రక్తాన్ని తాగి మీ కుటుంబం ఇంకా ఎన్ని కోట్లు సంపాదిస్తవో జవాబు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. సమాజానికి మహనీయుల చరిత్ర కనబడనీయకుండా చేసి

మా నాయనను మమ్మల్ని కీర్తించాలని, ప్రజలకు ఓట్ల విలువ తెలియనీయకుండా ఎన్ని సంవత్సరాలు ఏలుతరని ఆయన ప్రశ్నించారు., దేవుడు ప్రకృతి ఉంటే శిక్ష తప్పదని, ఇంత మోసం, అబద్దాలు ఆడుతున్న దుద్దిళ్ల కుటుంబానికే మొదటి శిక్ష వేయాలని వేడుకుంటునని అన్నారు. యువత ఆలోచన చేయాల్సిన అవసరం ఉందని,బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు యువతలో చైతన్యం తీసుకురావాలని, 420హామీలతో యావత్ రాష్ట్రాన్ని మోసం చేసిన దుద్దిళ్ల శ్రీధర్ మనం చైతన్యం కాకపోతే ఇంకా ఇలాగే మోసం చేస్తూనే పోతాడని ఆయన అన్నారు.



## రైల్లో 24.3 కిలోల ఎండు గంజాయి పట్టివేత..

# ఇద్దరు యువకుల అరెస్ట్

నిజామాబాద్, 21 ఆగస్ట్ : నిజామాబాద్ రైల్వే స్టేషన్ పరిధిలో రైలు తనిఖీల్లో భారీగా ఎండు గంజాయి పట్టుబడింది. విశ్వసనీయ సమాచారం మేరకు తెల్లవారుజామున 12.35 గంటల సమయంలో సాయి షిర్డీ రైలులో అర్పిఎఫ్ పోలీసులు, నిజామాబాద్ ఎస్‌ఎచ్‌ఓ ఆధ్వర్యంలో సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇద్దరు వ్యక్తులు తమ సీట్ల కింద రెండు సూట్‌కేసులతో అనుమానాస్పదంగా ప్రయాణిస్తుండటాన్ని పోలీసులు గుర్తించారు. సూట్‌కేసులను తనిఖీ చేయగా మొత్తం 24.3 కిలోల ఎండు గంజాయి లభించింది.దీంతో గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించారు.పోలీసుల విచారణలో తాము ఒడిశా నుంచి షిర్డీకి గంజాయిని తరలిస్తున్నామని నిందితులు తెలిపినట్లు అధికారులు వెల్లడించారు.ఈ రవాణా కోసం గుర్తుతెలియని వ్యక్తి తమకు రూ.10 వేల నగదు ఇచ్చి, షిర్డీలో ఒక నిర్దిష్ట ప్రదేశంలో ఆటో సిద్ధంగా ఉంటుందని, గంజాయిని ఆ ఆటోలో పెట్టి వెళ్లాలని సూచించినట్లు వారు చెప్పినట్లు పోలీసులు తెలిపారు. అరెస్టైన నిందితులు: గణేష్ పోలి (20), కుమార్ పోలి కుమారుడు, కలిమేఘి, జగిలిపడే పోస్టు, కోడాలా సబ్‌డివిజన్, గంజాం జిల్లా, ఒడిశా. దీపక్ సాహు (21), లోచన్ సాహు కుమారుడు, జగిలిపడే పోస్టు, గంజాం జిల్లా, ఒడిశా.స్వాధీనం చేసుకున్నవి: 24.3 కిలోల ఎండు గంజాయి2 మొబైల్ ఫోన్లునిందితులపై కేసు నమోదు చేసిన పోలీసులు వారిని గౌరవ న్యాయస్థానంలో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.



## మంత్రి వాకిటి శ్రీహరి సమక్షంలో బిజెపి నుండి కాంగ్రెస్ లోకి భారీ చేరికలు

**కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన మంత్రి వాకిటి శ్రీహరి**

నర్వ, 21 ఆగష్టు : మండల పరిధిలోని యాంకి గ్రామానికి చెందిన బిజెపి నాయకులు సర్పంచులు వార్డ్ మెంబర్లు భారీగా కాంగ్రెస్ పార్టీలోకి చేరారు మంత్రి వాకిటి శ్రీహరి సర్పంచులను వాడు మెంబర్లను కండువా కప్పి పార్టీలోకి సాధారణంగా ఆహ్వానించారు. యాంకి గ్రామానికి చెందిన సర్పంచ్ కళ్యాణి వెంకటన్న మాజీ ఉపసర్పంచ్ ఉప్పరి రమేష్ వార్డు సభ్యులు సహా 30 మంది కాంగ్రెస్ గూటికి చేరారు. ఈ సందర్భంగా నూతనంగా కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నాయకత్వంపై విశ్వాసంతో ప్రజా సంక్షేమం గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు తెలిపారు ఇకపై కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని అన్నారు. నర్వ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బిసం చెన్నయ్య సాగర్ మాట్లాడుతూ యాంకికు గ్రామంలో చోటు చేసుకున్న భారీ చేరికలతో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతమైందన్నారు రానున్న రోజుల్లో మరింత మంది నాయకులు కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

## పంచాయతీ కార్యదర్శి తీరుపై బీజేపీ ఆదోని మండల అధ్యక్షుడు ఉషా రాజు ఆగ్రహం

ఆదోని, 21 ఆగష్టు : కపటి గ్రామంలో వీధి దీపాల ఏర్పాటు విషయంలో గ్రామపంచాయతీ కార్యదర్శి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని బీజేపీ ఆదోని మండల అధ్యక్షులు ఉషా రాజు తీవ్రంగా మండిపడ్డారు. గ్రామంలో పలు వీధుల్లో దీపాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం వర్షాకాలం నడుస్తున్న నేపథ్యంలో విష పురుగుల భయం అధికంగా ఉందని, ఈ పరిస్థితుల్లో చిన్నారులు, వృద్ధులు రాత్రివేళ వీధుల్లో తిరుగాడాల్సి రావడం ప్రమాదకరమని పేర్కొన్నారు. వెంటనే అవసరమైన ప్రాంతాల్లో కొత్త వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, అలాగే పనిచేయని దీపాలను తక్షణమే మరమ్మతు చేయించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజల సమస్యలపై అధికారులు నిర్లక్ష్య వైఖరిని వీడి, తక్షణమే స్పందించి చర్యలు చేపట్టాలని ఉషా రాజు కోరారు.



## అమ్మవారి నామస్మరణతో మార్మోగిన పెబ్బేరు అయ్యప్ప ఆలయం

పెబ్బేరు,ఆగస్టు 21 మున్సిపల్ కేంద్రంలోని శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి దేవాలయంలో వరలక్ష్మీ వ్రత మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో, అంగరంగ వైభవంగా నిర్వహించారు.శ్రావణ మాసం శుక్రవారం సందర్భంగా తెల్లవారుజాము నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు ప్రారంభించారు.లలితా త్రిపుర సుందరిదేవి అమ్మవారికి అభిషేకాలు,సుందర అలంకరణలు చేసి భక్తులకు ప్రత్యేక దర్శనం కల్పించారు.పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో మహిళలు తరలివచ్చి సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించారు.అర్చకులు వ్రత విశిష్టతను వివరించారు.వరలక్ష్మీ వ్రతం సందర్భంగా ఆలయ ప్రాంగణమంతా భక్తులతో కిటకిటలాడింది.మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.భజన కీర్తనలు,అమ్మవారి నామస్మరణ తో ఆలయం మార్మోగింది.వ్రతం అనంతరం అమ్మవారికి పల్లకి సేవ నిర్వహించి,భక్తులకు తీర్థప్రసాదాలు,అన్నప్రసాద వితరణ చేశారు.అర్చకులు వెంకటేశ్వర్లుశర్మను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు.కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## ఎంఐఎంలోకి మైనారిటీ నాయకుల చేరిక

పెబ్బేరు, ఆగస్టు 21 మున్సిపల్ కేంద్రంలోని ఎంఐఎం పార్టీ కార్యాలయంలో శుక్రవారం పలువురు మైనారిటీ నాయకులు పార్టీలో చేరారు. ముబీన్, కమల్, ఖాజా, షానవాజ్, మహమ్మద్, అల్తాఫ్, ఆఫన్, అద్నాన్, తబ్రేజ్ లకు మండల అధ్యక్షుడు ఎం.డి. అఫ్రోజ్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అఫ్రోజ్ మాట్లాడుతూ పార్టీలో చేరిన ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యమని అన్నారు. అఫ్రోజ్ సేవా కార్యక్రమాలకు ఆకర్షితులై స్వచ్ఛందంగా చేరుతున్నామని, ఒవైసీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని పట్టణంలో పార్టీని మరింత బలోపేతం చేస్తామని ఈ సందర్భంగా వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎం నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కొత్తగా చేరిన వారికి శుభాకాంక్షలు తెలిపారు.

## కోర్టులో కేసు ఉన్న భూమిని డిజిటల్ చేసేందుకు వ్యక్తి ప్రయత్నం

**అధికారులను తప్పుదోవ పట్టించి భూమిని ఆన్లైన్ డిజిటల్ చేసుకోవాలని ప్రయత్నం**

నర్వ, 21 ఆగష్టు : మండల కేంద్రంలోని జంగం రెడ్డిపల్లి గ్రామంలో కోర్టులో కేసు నడుస్తున్న భూమిని ఆన్లైన్ ( డిజిటల్) చేసుకోవాలని ప్రయత్నం చేసిన వ్యక్తి చేసిన ప్రయత్నాన్ని రెవెన్యూ అధికారులు సమస్ఫూర్తితో గుర్తించి అడ్డుకున్నారు.ఈ ఘటన జంగంరెడ్డిపల్లి గ్రామంలోని ఒక భూమికి సంబంధించి 2017 నుంచి కోర్టులో కేసు పెండింగ్‌లో ఉంది.కోర్టు పరిధిలో ఉన్న ఆ భూమిని తన పేరున డిజిటల్ ఎంట్రీ చేయించుకునేందుకు ఓ వ్యక్తి అధికారులను తప్పుదోవ పట్టించి దరఖాస్తు చేసుకున్నాడు.

రికార్డులను పరిశీలిస్తున్న సమయంలో సదరు భూమిపై కోర్టులో వివాదం నడుస్తున్నట్లు అధికారులు గుర్తించారు.సమస్య కోర్టులో పెండింగ్‌లో ఉన్నట్లు స్పష్టమవడంతో ఆ ప్రక్రియను వెంటనే నిలిపివేసి వెనుదిరిగారు. కోర్టు వివాదాలున్న భూములను డిజిటల్ చేయడం నిబంధనలకు విరుద్ధమని అధికారులు స్పష్టం చేశారు.కోర్టు వివాదాల్లో ఉన్న భూములకు సంబంధించి ఎలాంటి ఆన్‌లైన్ లేదా మ్యూటేషన్ ప్రక్రియలు జరగకుండా రెవెన్యూ యంత్రాంగం మరింత నిఘా పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

# ముత్యాలమ్మ బోనాలకు జగదీష్ రెడ్డికి ఆహ్వానం



**సూర్యాపేట: ఆగస్టు 22( మన దీపం )**

ఈ నెల 30న సూర్యాపేట జిల్లా కేంద్రంలోని తాళ్లగడ్డలో నిర్వహించనున్న శ్రీ ఇంద్రవెల్లి ముత్యాలమ్మ తల్లి బోనాల పండుగకు హాజరుకావాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డిని ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో జగదీష్ రెడ్డిని ఆలయ కమిటీ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి బోనాల పండుగ ఆహ్వాన పత్రికను అందజేశారు. ప్రతి ఏటా భక్తిశ్రద్ధలతో నిర్వహించే ము త్యాలమ్మ తల్లి బోనాల ఉ త్సవాలను ఈసారి కూడా ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మ వారి ఆశీస్సులు పొందాలని వారు కోరారు.

# రామాపురం శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో గరుడ స్తంభం పునరుద్ధరణ

**చిలుకూరు, ఆగస్టు 21 (మన దీపం):**

చిలుకూరు మండలం రామాపురం గ్రామంలోని శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో దెబ్బతిన్న గరుడ స్తంభం స్థానంలో నూతన గరుడ స్తంభాన్ని ప్రతిష్ఠించాలని గ్రామ పెద్దలు, దేవాలయ కమిటీ సభ్యులు నిర్ణయించారు. శుక్రవారం ఆలయ ప్రాంగణంలో సమావేశమైన గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులు పునరుద్ధరణ కార్యక్రమంపై చర్చించారు. ఆలయంలో ప్రస్తుతం ఉన్న గరుడ స్తంభం దెబ్బతిన్న నేపథ్యంలో దానిని తొలగించి, ఆ స్థానంలో నూతన గరుడ స్తంభాన్ని ప్రతిష్ఠించి పునరుద్ధరణ కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించినట్లు గ్రామ పెద్దలు తెలిపారు. నూతన గరుడ స్తంభం ప్రతిష్ఠాపనకు అయ్యే పూర్తి ఖర్చును తానే భరిస్తానని మాజీ సర్పంచ్ తిపిరిశెట్టి కృష్ణ హామీ ఇచ్చారు. తన కుటుంబ సభ్యుల సహకారంతో ఈ కార్యక్రమాన్ని చేపడతానని తెలిపారు. ఆలయ అభివృద్ధికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని గ్రామ పెద్దలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ నిగడాల వీరయ్య, కమిటీ సభ్యులు వేమూరి వెంకటేశ్వర్లు, సాదే నాగేశ్వరరావు, గ్రామ సర్పంచ్ వేమూరి సతీష్ కుమార్, వార్డు సభ్యులు గన్నా కోటేష్ వర్మ, వేమూరి కృష్ణయ్య, పాయిలి వెంకటనారాయణ,



గ్రామ పెద్దలు తిపిరిశెట్టి కృష్ణయ్య, శ్రీనివాస్ రావు, వేమూరి బ్రహ్మయ్య, తిపిరిశెట్టి వెంకన్న, రాయబారపు వెంకటేశ్వర్లు, పాయిలి కోటేశ్వరరావు, ధనమూర్తి, వేమూరి వెంకటయ్య, కోటేశ్వరరావు, నరసింహారావు, నరేందర్, తిపిరిశెట్టి లక్ష్మీనారాయణ, వేమూరి జానకి, గోపతి శ్రీను, అమరగాని నరసింహారావు, బడేటి వెంకన్న, గన్నా వెంకటేశ్వర్లు, పాయిలి వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, రామ్మూర్తి తదితరులతో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# జీవో 97ను రద్దు చేయాలి

**ఆర్డీవో కార్యాలయం ఎదుట డిప్లమా విద్యార్థుల భారీ ధర్నా**

**విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టొద్దు**

**బీఆర్ఎస్ నాయకుడు బెజవాడ శ్రవణ్**

**కోదాడ, ఆగస్టు 21 (మన దీపం):**

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీవో నంబర్ 97ను తక్షణమే రద్దు చేయడంతో పాటు శక్తి పథకాన్ని ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ కోదాడలో వందలాది మంది డిప్లమా విద్యార్థులు ఆర్డీవో కార్యాలయం ఎదుట భారీ ధర్నా నిర్వహించారు. ప్రభుత్వ నిర్ణయంతో డిప్లమా విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. జీవో 97ను ఉపసంహరించుకునే వరకు తమ ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. విద్యార్థుల నిరసనకు బీఆర్ఎస్ కోదాడ నియోజకవర్గ నాయకుడు బెజవాడ శ్రవణ్ మద్దతు ప్రకటించి ధర్నాలో పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు, నాయకులతో కలిసి ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బెజవాడ శ్రవణ్ మాట్లాడుతూ స్కిల్ యూనివర్సిటీ పేరిట రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తూ విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటోందని విమర్శించారు. దశాబ్దాలుగా కొనసాగుతున్న ఎస్బీటీఈటీ (స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్) వ్యవస్థను నిర్వీర్యం చేసే విధం గా ప్రభుత్వ నిర్ణయాలు ఉన్నాయని ఆరోపించారు. మూ డేళ్ల డిప్లమా కోర్సుకు అదనం గా రెండేళ్ల బ్రిడ్జ్ కోర్సును జోడించడం వల్ల విద్యార్థులపై సమయం, ఆర్థిక భారం పెరిగి తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటివరకు అమల్లో ఉన్న విధంగానే డిప్లమా పూర్తయిన




వెంటనే లేటరల్ ఎంట్రీ ద్వారా బీటెక్ ద్వితీయ సంవత్సరంలో ప్రవేశం పొందే అవకాశాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టే నిర్ణయాలను ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని శ్రవణ్ కోరారు. విద్యార్థుల మద్దతుతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం వారి సమస్యలను విస్మరిస్తే అదే విద్యార్థులు ప్రభుత్వానికి తగిన సమాధానం చెబుతారని హెచ్చరించారు. బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ నాయకత్వంలో విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం పోరాటాలను కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నవీన్, వివిధ విద్యార్థి సంఘాల నాయకులు, ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో డిప్లమా విద్యార్థులు పాల్గొన్నారు.

# రూ.13 వేల లంచం తీసుకుంటూ పంచాయతీ కార్యదర్శి పట్టివేత

**ఫోన్‌పే ద్వారా నగదు బదిలీ చేయించిన వైనం**

**మంచిర్యాల, ఆగస్టు 21 (మన దీపం):**

ఇంటి నిర్మాణ అనుమతి, ఇంటి నంబర్ కేటాయింపు కోసం రూ.13,000 లంచం తీసుకుంటూ జన్నారం మండలం లింగాయిపల్లి పంచాయతీ కార్యదర్శి జె. వరలక్ష్మి ఆదిలాబాద్ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. మొదట రూ.20,000 డిమాండ్ చేసి, చివరకు రూ.13,000కు అంగీకరించిన ఆమె, నగదు కాకుండా మరో పంచాయతీ కార్యదర్శి లావణ్య ఫోన్‌పే ఖాతాకు బదిలీ చేయాలని ఫిర్యాదుదారుడికి సూచించారు. బాధితుడు ఆ మొత్తాన్ని బదిలీ చేయగానే డిజిటల్ ఆధారాలను సేకరించిన ఏసీబీ అధికారులు ఆమెను అరెస్టు చేసి కరీంనగర్ ఏసీబీ ప్రత్యేక న్యాయ స్థానంలో హాజరుపరిచారు.



# మాదాపూర్ ప్రమాదం కేసులో సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారమే చర్యలు

**బాహ్య ఒత్తిళ్లు లేవని పోలీసుల వివరణ**

**హైదరాబాద్, ఆగస్టు 21 (మన దీపం):**

ఇటీవల నమోదైన రోడ్డు ప్రమాదం కేసులో నిందితుడిని అరెస్టు చేయకపోవడం చట్టప్రకారమే జరిగిందని, ఎలాంటి బాహ్య ఒత్తిళ్లు లేవని మాదాపూర్ పోలీసులు స్పష్టం చేశారు. ఆగస్టు 16న భారతీయ న్యాయ సంహిత (దీఛీూ) సెక్షన్ 106(1) కింద కేసు నమోదైంది. నిందితుడికి నిర్వహించిన ఆల్కహాల్, డ్రగ్స్ ప్రాథమిక పరీక్షల్లో నెగెటివ్ వచ్చిందని తెలిపారు. ఈ సెక్షన్ కింద గరిష్ఠ శిక్ష ఐదేళ్లు మాత్రమే ఉన్నందున, సుప్రీంకోర్టు అర్నేష్ కుమార్ వర్సెస్ స్టేట్ ఆఫ్ బీహార్ మార్గదర్శకాలు, బీఎన్ఎస్ఎస్ (దీచీూూ) సెక్షన్ 35 ప్రకారం నోటీసు జారీ చేసి విచారణకు సహకరించాల్సిందిగా ఆదేశించినట్లు స్పష్టం చేశారు. దర్యాప్తు కొనసాగుతోందని, తదుపరి ఆధారాల ఆధారంగా అవసరమైతే చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

# హైదరాబాద్‌లో అక్రమ ఇంజెక్షన్ల రాకెట్ గుట్టురట్టు

**నలుగురి అరెస్టు.. రూ.1.85 లక్షల విలువైన ఇంజెక్షన్లు స్వాధీనం**

**హైదరాబాద్, ఆగస్టు 21 (మన దీపం):**

జిమ్‌లలో కండలు పెంచేందుకు వాడే మెఫెంటెర్మైన్ సల్ఫేట్ (వీవజూష్ట్రవత్‌వతీఎఅవ ాబశ్రీజూష్ట్రీవ) అక్రమ ఇంజెక్షన్లను విక్రయిస్తున్న నలుగురిని గోషామహల్ పోలీసులతో కలిసి టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితులు గౌతమ్ సింగ్, ఆర్. అభిలాష్, వినియోగదారులు సిద్దేష్, దక్ష్ ఉపాధ్యాయ్‌లను బేగంబజార్ వద్ద పట్టుకున్నారు. వారి నుంచి రూ.1.85 లక్షల విలువైన 50 వయల్స్ ఇంజెక్షన్లు, సిరంజీలు, ఫోన్లు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. మీరట్ నుంచి ఒక్కో వయల్‌ను రూ.160కి వాట్సాప్ ద్వారా తెప్పించి, హైదరాబాద్‌లో రూ.900కి అమ్ముతున్నట్లు గుర్తించారు. డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా వీటిని వాడటం తీవ్ర ఆరోగ్య సమస్యలకు దారితీస్తుందని పోలీసులు హెచ్చరించారు.

# రాయదుర్గం భూముల ఈ-వేలంలో రికార్డు

**ఎకరం రూ.264 కోట్లు 5.25 ఎకరాలకు రూ.1,386 కోట్ల ఆదాయం**

హైదరాబాద్, ఆగస్టు 21 (మన దీపం): తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ నిర్వహించిన రాయదుర్గం ప్లాట్ నంబర్ 1 ఈ-వేలంలో 5.25 ఎకరాల స్థలానికి రూ.1,386 కోట్ల రికార్డు ఆదాయం లభించింది. ఎకరానికి రూ.175 కోట్ల కనీస ధర నిర్ణయించగా, వేలంలో ఏకంగా 50.9 శాతం అధికంగా ఎకరానికి రూ.264 కోట్ల రికార్డు ధర పలికింది. 2026 మే నెలలో జరిగిన వేలంలో ఎకరం రూ.237 కోట్లు పలకగా, తాజా వేలంలో ఆ రికార్డు కూడా బద్దలైంది. తెలంగాణ అభివృద్ధి నమూనా, పారదర్శక విధానాలపై దెవలపర్లకు ఉన్న నమ్మకానికి ఈ ఫలితాలే నిదర్శనమని టీజీఐఐసీ వీసీ అండ్ ఎండీ కె. శశాంక తెలిపారు.

# ఖేలో ఇండియా నయా రూపం అద్భుతం

**దేశీయ క్రీడారంగానికి గేమ్‌ఛేంజర్: జ్వాలా గుత్తా**

**హైదరాబాద్, ఆగస్టు 21 (మన దీపం):**

కేంద్ర ప్రభుత్వం కొత్తగా రూపొందించిన 'ఖేలో ఇండియా' పథకం దేశీయ క్రీడారంగ రూపురేఖలను మార్చే గేమ్‌ఛేంజర్ అని రెండుసార్లు ఒలింపియన్, ప్రపంచ బ్యాడ్మింటన్ మెడలిస్ట్ జ్వాలా గుత్తా ప్రశంసించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. అట్టడుగు స్థాయి నుంచి ప్రతిభను గుర్తించేందుకు, క్రీడాకారులకు దీర్ఘకాలిక మద్దతు అందించేందుకు ఈ విధానం ఎంతగానో దోహదపడుతుందన్నారు. 2026–31 కాలానికి గాను ఖేలో ఇండియా బడ్జెట్‌ను ఎనిమిది రెట్లు పెంచి రూ.29,054 కోట్లు కేటాయించారు. తెలంగాణలో ఇప్పటికే 33 ఖేలో ఇండియా కేంద్రాలు, మేడ్చల్–మల్కాజ్‌గిరిలో స్టేట్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ పనిచేస్తున్నాయని అధికారులు తెలిపారు. క్రీడలను విద్యావిధానంతో అనుసంధానించడం ద్వారా తెలంగాణ క్రీడాకారులకు విశేష ప్రయోజనం చేకూరుతుందని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ వీసీ అండ్ ఎండీ డాక్టర్ ఎ. సోనిబాలా దేవి పేర్కొన్నారు.

# 94 ఏళ్ల వయసులో దక్షిణాది దిగ్గజ నటి షావుకారు జానకి కన్నుమూత

**ఏడు దశాబ్దాలకు పైగా సాగిన సినీ ప్రస్థానం**

**హైదరాబాద్, ఆగస్టు 21 (మన దీపం):**

ఏడు దశాబ్దాలకు పైగా సినీ ప్రయాణంతో దక్షిణాది చిత్రసీమలో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్న అలనాటి నటి షావుకారు జానకి (94) అనారోగ్యంతో కావేరి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం కన్నుమూశారు.

1931 డిసెంబర్ 12న ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రిలో జన్మించిన ఆమె అసలు పేరు శంకరమంచి జానకి. రేడియో నాటకాల ద్వారా ప్రస్థానం ప్రారంభించి, 1950లో ఎల్.వి. ప్రసాద్ దర్శకత్వంలో వచ్చిన 'షావుకారు' సినిమాతో వెండితెరకు పరిచయమయ్యారు. ఆ సినిమా ఘనవిజయంతో ఆమె పేరు 'షావుకారు జానకి'గా స్థిరపడింది. తెలుగులో ఎన్టీఆర్, ఏఎన్నార్‌లతో పాటు తమిళంలో ఎంజీఆర్, శివాజీ గణేశన్ వంటి అగ్ర నటులతో నటించారు. 'రోజులు మారాయి', 'కన్యాశుల్కం', 'జయం మనదే', 'పాండురంగ మహత్యం', 'డాక్టర్ చక్రవర్తి', 'అక్కాచెల్లెళ్లు', 'బడిపంతులు', 'సంసారం ఒక చదరంగం' ఆమెకు గుర్తింపు తెచ్చిన చిత్రాలు. ఆమె సేవలకు గాను తమిళనాడు ప్రభుత్వం కళైమామణి, ఏపీ ప్రభుత్వం నంది పురస్కారాలతో పాటు, 2022లో భారత ప్రభుత్వం 'పద్మశ్రీ' పురస్కారాన్ని అందించింది.

# పరిశ్రమల కోసం టీజీఎస్పీడీసీఎల్ సింగిల్ విండో సదుపాయం

**సీఆర్ఎంలుగా అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్లు**

**హైదరాబాద్, ఆగస్టు 21 (మన దీపం):**

పారిశ్రామిక వినియోగదారుల విద్యుత్ సమస్యల పరిష్కారానికి 'కస్టమర్ రిలేషన్‌షిప్ మేనేజర్ (జ=వీ)' వ్యవస్థను ప్రవేశపెట్టనున్నట్లు టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్ తెలిపారు. అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్లను (ూాఉజుం) సీఆర్ఎమ్‌లుగా నియమించే మార్గదర్శకాలు నెల రోజుల్లో రానున్నాయి. మల్లాపూర్, కీసర, బాలానగర్, షాద్‌నగర్, తూప్రాన్ ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయాలను సరిదిద్దాలని అధికారులను ఆదేశించారు. కొత్త కనెక్షన్ల కోసం సమీప సబ్‌స్టేషన్లను గుర్తించేందుకు వీలుగా ఎఫ్‌టీసీసీఐకి గ్రిడ్ మ్యాప్‌లను అందజేయనున్నారు. సౌర విద్యుత్, ఓపెన్ యాక్సెస్, పీఎం–కుసుమ్, బకాయిల కోసం ప్రతిపాదించిన వన్–టైమ్ సెటిల్‌మెంట్ (ూూ) పథకం వంటి అంశాలు చర్చకు వచ్చాయి.

# సూర్యాపేటలో ప్రైవేట్ ఉపాధ్యాయుల శాంతియుత నిరసన ర్యాలీ

**రూపారెడ్డి హత్యపై ఉపాధ్యాయ లోకం తీవ్ర ఆవేదన**

**ఉపాధ్యాయుల రక్షణకు ప్రత్యేక చట్టాలు తీసుకురావాలని డిమాండ్**

**రెండు వేల మంది ఉపాధ్యాయులు, ప్రిన్సిపల్స్, కరస్పాండెంట్లతో భారీ ర్యాలీ**







**సూర్యాపేట టౌన్, ఆగస్టు 21 (మన దీపం):**
నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లిలోని నాగార్జున పాఠశాల ప్రిన్సిపల్ రూపారెడ్డి దారుణ హత్యకు గురైన ఘటనను నిరసిస్తూ సూర్యాపేట పట్టణంలో శుక్రవారం ప్రైవేట్ ఉపాధ్యాయులు భారీ శాంతియుత నిరసన ర్యాలీ నిర్వహించారు. రూపారెడ్డి హత్య పట్ల తీవ్ర దిగ్భ్రాంతి, ఆవేదన వ్యక్తం చేస్తూ ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. యునైటెడ్ ట్రస్మా, తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ అండ్ లెక్చరర్స్ ఫెడరేషన్ (టీపీటీఎల్ఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో సుమారు రెండు వేల మంది ఉపాధ్యాయులు, వివిధ పాఠశాలల ప్రిన్సిపల్స్, కరస్పాండెంట్లు పాల్గొన్నారు. పట్టణంలోని ప్రధాన వీధుల గుండా శాంతియుతంగా ర్యాలీ నిర్వహించి రూపారెడ్డి హత్యను ఖండించారు. ఉపాధ్యాయులకు రక్షణ కల్పించాలని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పలువురు ప్రతినిధులు మాట్లాడుతూ సమాజంలో తల్లిదండ్రుల తర్వాత గురువుకే అత్యున్నత స్థానం ఉంటుందని, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే గురువుపైనే దాడి చేసి ప్రాణాలు తీయడం అత్యంత దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు విద్యాబుద్ధులతో పాటు క్రమశిక్షణ, మంచి నడవడిక నేర్పించడం ఉపాధ్యాయుల బాధ్యత అని పేర్కొన్నారు. విద్యార్థి తప్పు దోవ పట్టినప్పుడు మందలించడం కూడా అతని భవిష్యత్తు బాగుండాలనే ఉద్దేశంతోనేనని అన్నారు. తమ వద్ద విద్యాబుద్ధులు నేర్చుకుంటున్న విద్యార్థులు గంజాయి, మాదకద్రవ్యాల వంటి వ్యసనాలకు బానిసై చెడు మార్గంలో పయనిస్తుంటే వారిని మందలించడం ఉపాధ్యాయుల తప్పా అని ప్రశ్నించారు. విద్యార్థుల ప్రవర్తనలో మార్పు తీసుకువచ్చి వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నించే ఉపాధ్యాయులు భయాందోళనల మధ్య విధులు నిర్వర్తించాల్సిన పరిస్థితి రావడం సమాజానికి మంచిది కాదన్నారు. స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా విద్యాబోధన చేస్తున్న ఉపాధ్యాయుల భద్రతకు ప్రత్యేకమైన కఠిన చట్టాలు లేకపోవడం బాధాకరమన్నారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు నిర్భయంగా విధులు నిర్వర్తించే వాతావరణాన్ని ప్రభుత్వం కల్పించాలని కోరారు. ఉపాధ్యాయులపై దాడులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకునే విధంగా ప్రత్యేక చట్టపరమైన రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని, గురువులు చెప్పే ప్రతి మాట తమ మంచికేనన్న విషయాన్ని విద్యార్థులు గ్రహించాలని సూచించారు. పాఠశాలల్లో క్రమశిక్షణతో పాటు గురువుల పట్ల గౌరవ భావాన్ని పెంపొందించేలా తల్లిదండ్రులు కూడా పిల్లలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం కూడా విద్యాసంస్థల్లో భద్రతపై ప్రత్యేక దృష్టి సారించి ఉపాధ్యాయులు, విద్యార్థులకు సురక్షిత వాతావరణం కల్పించాలని కోరారు. రూపారెడ్డి హత్య ఘటనను ప్రభుత్వం తీవ్రంగా పరిగణించి బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యునైటెడ్ ట్రస్మా ప్రతినిధులు త్రివేణి హరి, ఆర్. ప్రకాష్‌రెడ్డి, పగడాల ఉపేందర్‌రెడ్డి, రామసాని శ్రీనివాసనాయుడు, ఖమ్మంపాటి భిక్షపతి, గాలి రమేష్, మారం లింగారెడ్డి, వెంపటి అజయ్‌కుమార్, తీగల ఉపేందర్‌రావు, టీపీటీఎల్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నరసింహారావు, గౌరవాధ్యక్షుడు సోమరాజు, ఉపాధ్యక్షులు బాలకృష్ణ, రాజశేఖర్‌తో పాటు వివిధ ప్రైవేట్ విద్యాసంస్థల ప్రిన్సిపల్స్, కరస్పాండెంట్లు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## మున్నూరు కాపు విద్యార్థి వసతి గృహ నిర్మాణానికి భూమిపూజ

**గ్రామీణ విద్యార్థులకు వసతి సౌకర్యమే లక్ష్యం**

**నల్లగొండ, ఆగస్టు 21 (మన దీపం):**
నల్లగొండ పట్టణంలోని ఎన్ఆర్ఎస్ గార్డెన్స్ సమీపంలో మున్నూరు కాపు విద్యార్థి వసతి గృహ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్మించనున్న విద్యార్థి వసతి గృహానికి శుక్రవారం భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ హాజరై పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల నుంచి ఉన్నత చదువుల కోసం నల్లగొండకు వచ్చే మున్నూరు కాపు విద్యార్థులకు వసతి సౌకర్యం కల్పించాలనే లక్ష్యంతో హాస్టల్ నిర్మాణం చేపట్టడం అభినందనీయమన్నారు. భవన నిర్మాణానికి అవసరమైన నిధుల సేకరణలో తమవంతు సహకారం అందిస్తామని తెలిపారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని మున్నూరు కాపు కులబంధువులందరూ ఈ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

తెలంగాణలోని మున్నూరు కాపు సామాజికవర్గానికి చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు, వివిధ హోదాల్లో ఉన్న ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకుల సహకారంతో భవన నిర్మాణానికి నిధులు సమీకరించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

కార్యక్రమంలో ట్రస్టు అధ్యక్షుడు నేతి రఘుపతి, ప్రధాన కార్యదర్శి తోకల వెంకటకృష్ణ, కోశాధికారి నేతి ఉమామహేశ్వర్, తెలంగాణ మున్నూరు కాపు జర్నలిస్టుల ఫోరం ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు తుడి జనార్దన్ పటేల్, గౌరవాధ్యక్షుడు కాటం సునీల్, ఉపాధ్యక్షుడు మేకల వెంకన్న, సహాయ కార్యదర్శి రామగిరి

## ఎడమ కాల్వకు వెంటనే సాగునీరు విడుదల చేయాలి: జగదీశ్ రెడ్డి

**ఆంధ్రప్రదేశ్‌కు నీటి తరలింపును అడ్డుకోవడంలో జిల్లా మంత్రులు విఫలం**

**సాగర్‌లో నీరున్నా రైతులకు ఇవ్వకపోవడం అన్యాయం**

**నీరు విడుదల చేయకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఉద్యమం**



**నల్లగొండ: ఆగస్టు 22 ( మన దీపం )**
నాగార్జునసాగర్ ఎడమ కాల్వతో పాటు దాని పరిధిలోని లిఫ్ట్‌లకు వెంటనే సాగునీరు విడుదల చేయాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం నల్లగొండ జిల్లా కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాల విషయంలో తెలంగాణకు అన్యాయం జరుగుతున్నా రాష్ట్ర ప్రభుత్వం స్పందించడంలేదని ఆయన ఆరోపించారు. పోతిరెడ్డిపాడు ద్వారా ఆంధ్రప్రదేశ్ భారీగా నీటిని తరలించుకుంటోందని, ఇప్పటివరకు సుమారు 148 టీఎంసీల నీటిని తీసుకెళ్లిందని పేర్కొన్నారు. న్యాయంగా నాగార్జునసాగర్‌కు రావాల్సిన నీటిని అడ్డుకుంటున్నా జిల్లా మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రశ్నించలేకపోతున్నారని విమర్శించారు. ప్రస్తుతం నాగార్జునసాగర్‌లో 532 అడుగుల నీటిమట్టం ఉందని, సుమారు 30 టీఎంసీల నీరు అందుబాటులో ఉన్నందున ఎడమ కాల్వకు సాగునీరు విడుదల చేసే అవకాశం ఉందని జగదీశ్ రెడ్డి పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సాగర్‌లో ఇప్పటికంటే తక్కువ నీటిమట్టం ఉన్న సందర్భాల్లోనూ రైతులకు సాగునీరు అందించామని తెలిపారు. వరుసగా 17 సార్లు నీటిని విడుదల చేయడంతో పాటు ఎడమ కాల్వ పరిధిలోని లిఫ్ట్‌లకు కూడా నీరు అందించామని చెప్పారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో తెలంగాణ నీటి హక్కులను కాపాడామని, ఆంధ్రప్రదేశ్ ఇష్టానుసారంగా నీటిని తరలించకుండా అడ్డుకున్నామని అన్నారు. సాగర్ నుంచి నీరు సముద్రంలోకి వృథాగా వెళ్లే పరిస్థితుల్లోనే పోతిరెడ్డిపాడు ద్వారా నీటిని తీసుకోవాలన్న నిబంధనలు ఉన్నాయని, ప్రస్తుతం వాటిని పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

## అంబేద్కర్ జ్ఞాన కేంద్రం నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలి

**ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు విడుదల చేయాలి**

**సూర్యాపేట, ఆగస్టు 21 (మన దీపం):**
సూర్యాపేట జిల్లా కేంద్రంలో నిలిచిపోయిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జ్ఞాన కేంద్రం భవన నిర్మాణ పనులను వెంటనే పునఃప్రా రంభించి త్వరితగతిన పూర్తి చేయాలని మాల మహానాడు నాయకులు రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను కోరారు. గురువారం సూర్యాపేట జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ఎస్సీ, ఎస్టీ సమీక్ష సమావేశానికి హాజరైన కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను మాల మహానాడు తెలంగాణ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు, న్యాయవాది తలమల్ల హసేన్ ఆధ్వర్యంలో నాయకులు కలిసి వినతిపత్రం అంద జేశారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎస్సీ, ఎస్టీ వర్గాలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను కమిషన్ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జ్ఞాన కేంద్రం భవన నిర్మాణం నిలిచిపోవడంతో లక్ష్యం నెరవేరడం లేదని పేర్కొన్నారు. నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించి నిర్ణీత గడువులో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో సీసీ రోడ్లు, సీసీ డ్రైనేజీలు తదితర మౌలిక వసతుల కల్పనకు అవసరమైన ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను వెంటనే విడుదల చేసి అభివృద్ధి పనులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.



## మోతే కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడిగా శ్రీకాంత్

**మోతే, ఆగస్టు 21 (మన దీపం ప్రతినిధి):**
మోతే కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ నూతన అధ్యక్షుడిగా నిమ్మనగోటి శ్రీకాంత్ నియమితులయ్యారు. శుక్రవారం మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డి సమక్షంలో గ్రామ కాంగ్రెస్ సమన్వయ కమిటీ సభ్యులు, కార్యకర్తల ఏకాభిప్రాయం మేరకు శ్రీకాంత్‌ను నూతన అధ్యక్షుడిగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ పార్టీలో వర్గ విభేదాలకు తావులేకుండా ప్రతి కార్యకర్తను గౌరవిస్తూ, అందరినీ కలుపుకొని పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు అర్హులైన ప్రజలకు అందేలా తనవంతు కృషి చేస్తానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ పందిళ్లపల్లి పుల్లారావు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సామా చిన్న వెంకరెడ్డి, రాష్ట్ర కిసాన్ సెల్ కోఆర్డినేటర్ మధుసూదన్‌రెడ్డి, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెలుగు వీరన్న, మాజీ సర్పంచ్ మెట్టు నారాయణరెడ్డి, గ్రామ కాంగ్రెస్ నాయకులు బొల్లం నారాయణ, అయితగాని వెంకన్న, బొడ్డు సాలయ్య, బొక్క ఉపేందర్‌రెడ్డి, బొక్క ఎల్లారెడ్డి, కారింగుల కనకయ్య, బొడ్డు నరసయ్య, యువజన కాంగ్రెస్ నాయకుడు అందెం గోపి తదితరులు పాల్గొన్నారు.



# బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్మన్ రాజీనామా చేయాలి

**వరంగల్ కోర్టు ఎదుట న్యాయవాదుల నిరసన**




**హనుమకొండ, ఆగస్టు 21 (మన దీపం):**
బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) చైర్మన్ మనన్ కుమార్ మిశ్రా వ్యవహారశైలి వల్ల సంస్థ గౌరవం, విశ్వసనీయత దెబ్బతింటున్నాయని ఆరోపిస్తూ ఆయన తక్షణమే పదవికి రాజీనామా చేయాలని వరంగల్, హనుమకొండ జిల్లాల న్యాయవాదులు డిమాండ్ చేశారు. శుక్రవారం హనుమకొండలోని కోర్టు ప్రధాన గేటు ఎదుట ధర్నా నిర్వహించి నిరసన తెలిపారు. ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఏఐఎల్‌యూ) ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా చేపట్టిన నిరసనల్లో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (ఐఎల్‌పీఏ), ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్), కాంగ్రెస్ లీగల్ సెల్ నాయకులు, న్యాయవాదులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏఐఎల్‌యూ రాష్ట్ర కోశాధికారి ఎన్నంశెట్టి వేణుగోపాల్‌రావు మాట్లాడుతూ, న్యాయవాద వృత్తి పరిరక్షించాల్సిన రాజ్యాంగ, ప్రజాస్వామిక విలువలకు అనుగుణంగా బీసీఐ పనిచేయాల్సి ఉందన్నారు. అయితే చైర్మన్ మనన్ కుమార్ మిశ్రా ఏకపక్ష నిర్ణయాలతో సంస్థ స్వతంత్రతను దెబ్బతీస్తున్నారని ఆరోపించారు. నల్సార్ విశ్వవిద్యాలయ విద్యార్థుల విషయంలో ఆయన వ్యవహరించిన తీరు అభ్యంతరకరమని, అనంతరం విద్యార్థులకు క్షమాపణ చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో బీసీఐ చైర్మన్ పదవిలో కొనసాగే నైతిక అర్హత ఆయనకు లేదని వ్యాఖ్యానించారు. మిశ్రా సుదీర్ఘకాలంగా చైర్మన్‌గా కొనసాగుతూ వ్యక్తిగత నిర్ణయాలతో సంస్థ ప్రజాస్వామిక స్వభావాన్ని దెబ్బతీస్తున్నారని ఆరోపించారు. రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన తర్వాత కూడా బీసీఐ చైర్మన్‌గా కొనసాగడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. పౌరసత్వ సవరణ చట్టం, ఆర్టికల్ 370 రద్దు, రైతుల ఆందోళనలు తదితర రాజకీయ, సామాజిక అంశాలపై బీసీఐ పేరుతో ప్రకటనలు చేయడం సంస్థ తటస్థతను ప్రశ్నార్థకం చేస్తోందన్నారు. ఐఎల్‌పీఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తీగల జీవన్‌గౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిని నరేందర్ మాట్లాడుతూ, అడ్వకేట్స్ యాక్ట్-1961 ప్రకారం ఏర్పాటైన బీసీఐ న్యాయవాదుల హక్కులు, సంక్షేమం, వృత్తి స్వతంత్రత కోసం పనిచేయాల్సిన చట్టబద్ధ సంస్థ అని పేర్కొన్నారు. విభిన్న రాజకీయ భావజాలాలకు చెందిన న్యాయవాదులకు ప్రాతినిధ్యం వహించాల్సిన సంస్థ ఒక రాజకీయ పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తోందన్న భావన కలగడం మంచిది కాదన్నారు. జంతర్‌మంతర్ వద్ద నిరసన తెలిపిన విద్యార్థులపై చైర్మన్ చేసిన వ్యాఖ్యలను వారు తీవ్రంగా ఖండించారు. మనన్ కుమార్ మిశ్రా రాజీనామా చేసే వరకు దేశవ్యాప్తంగా ఆందోళనలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐఎల్‌యూ రాష్ట్ర కమిటీ సభ్యుడు సారంపల్లి మధుసూదన్‌రెడ్డి, ఐఎల్‌పీఏ నాయకులు జన్ను పద్మ, పెండ్యాల అనిల్, జన్ను ప్రభాకర్, హనుమకొండ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు రఘుపతి, ఐఏఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీమనాథం శ్రీనివాస్, కొత్తపల్లి చిరంజీవి, చంద్రమౌళి, మేడారపు రంజిత్, పాము రమేష్‌తో పాటు న్యాయవాదులు అబ్దుల్ నబి, ఆనంద్, గంజి రమేష్, గంధం శివ, పూర్ణచందర్, భవాని ప్రసాద్, ప్రభంజన్, పూసపల్లి శ్రీనివాస్, యాకస్వామి, బండి మొగిలి, ఇజ్జగిరి సురేష్, మల్లేష్, విష్ణువర్ధన్, వేములు రమేష్, బండి హరీష్, గురిమిల్ల రాజు, మర్రి రాజు, బానోత్ విజయ్, మేకల రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి కొండా సురేఖను బర్తరఫ్ చేయాలి

**పార్టీ నుంచి బహిష్కరించాలని కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల డిమాండ్**

**హైదరాబాద్, ఆగస్టు 21 (మన దీపం):**
మంత్రి కొండా సురేఖ, ఆమె కుమార్తె కొండా సుష్మిత చేసిన వ్యాఖ్యల వివాదం తీవ్రరూపం దాల్చింది. సురేఖను వెంటనే మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని, పార్టీ నుంచి బహిష్కరించాలని డిమాండ్ చేస్తూ 15 మందికి పైగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సీఎల్పీలో అత్యవసర విలేకరుల సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ చీఫ్ విప్ బీర్ల ఐలయ్య మాట్లాడుతూ.. తన కుమార్తె చేసిన వ్యాఖ్యలతో తనకు సంబంధం లేదనడం విడ్డూరంగా ఉందని, బహిరంగంగా సీఎంను లక్ష్యంగా చేసుకోవడం సరికాదన్నారు. ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ కొండా కుటుంబం బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. పార్టీలో ఉంటూ విపక్షాల ఎజెండాను అమలు చేస్తున్నారని మండిపడ్డారు.

# రూ.100 కోట్ల క్లబ్‌లో ‘డీసీ’.. లోకీ సత్తా!




**హైదరాబాద్, ఆగస్టు 21 :**

దర్శకుడు అరుణ్ మాథేశ్వరన్ తెరకెక్కించిన ‘డీసీ’ చిత్రం బాక్సాఫీస్ వద్ద దూసుకెళ్తోంది. ప్రముఖ దర్శకుడు లోకేష్ కనగరాజ్ ప్రధాన పాత్రలో నటించిన ఈ రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ విడుదలైన కొద్దిరోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.100 కోట్ల వసూళ్లను సాధించింది. సన్ పిక్చర్స్ పతాకంపై కళానిధి మారన్ నిర్మించిన ఈ సినిమాకు తొలి రోజు నుంచే ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. భారీ వసూళ్లతో దూసుకెళ్తున్న ‘డీసీ’ తాజాగా రూ.100 కోట్ల క్లబ్‌లో చేరడంతో చిత్రబృందం ఆనందం వ్యక్తం చేస్తోంది. శరత్ చంద్ర చటోపాధ్యాయ రాసిన ‘దేవదాస్’ నవల స్ఫూర్తితో ఈ చిత్రాన్ని అరుణ్ మాథేశ్వరన్ తనదైన మాస్ యాక్షన్ శైలిలో తెరకెక్కించారు. దేవదాస్ పాత్రలో లోకేష్ కనగరాజ్ తొలిసారి నటించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. చంద్ర పాత్రలో వామికా గబ్బి, మరో కీలక పాత్రలో సంజనా కృష్ణమూర్తి నటించారు. అనిరుధ్ రవిచందర్ అందించిన నేపథ్య సంగీతం, ముకేష్ జి ఛాయాగ్రహణం, ప్రసన్న జి.కె ఎడిటింగ్ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. దర్శకుడిగా ఇప్పటికే తన ప్రతిభను చాటుకున్న లోకేష్.. నటుడిగానూ ప్రేక్షకుల ప్రశంసలు అందుకుంటున్నారు.




# నయనతార హాయ్.. ఆకట్టుకుంటున్న ట్రైలర్

**హైదరాబాద్, ఆగస్టు 21 :**

లేడీ సూపర్‌స్టార్ నయనతార, యువ హీరో కవిన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ప్రేమకథా చిత్రం ‘హాయ్’ ట్రైలర్‌ను చిత్రబృందం తాజాగా విడుదల చేసింది. తమిళంతో పాటు తెలుగు ట్రైలర్‌ను కూడా విడుదల చేశారు. ఆగస్టు 28న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రముఖ గీత రచయిత విష్ణు ఎడవన్ ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ప్రేమ వివాహం కోసం ప్రయత్నించి విఫలమయ్యే యువకుడిగా కవిన్ కనిపించగా.. స్వతంత్ర భావాలున్న మహిళగా నయనతార దేవసేన పాత్రలో నటించారు. అనుకోని పరిస్థితుల్లో వీరిద్దరికీ వివాహం జరగడం, ఆ తర్వాత ఎదురయ్యే మనస్పర్థలు, భావోద్వేగాల చుట్టూ కథ సాగనున్నట్లు ట్రైలర్ ద్వారా తెలుస్తోంది. కవిన్, నయనతారల తెరపై జోడీ కొత్తగా ఆకట్టుకుంటోంది. ప్రేమ, వినోదం, భావోద్వేగాలతో ట్రైలర్ ఆసక్తిని పెంచుతోంది. కే. భాగ్యరాజ్, ప్రభు, రాధికా శరత్‌కుమార్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు. జెన్ మార్టిన్ సంగీతం అందించగా, రాజేష్ శుక్లా ఛాయాగ్రహణం వహించారు.

# ‘ఇరుముడి’ ఎలా ఉందంటే.. రవితేజకు మంచి కమ్‌బ్యాక్!

**హైదరాబాద్, ఆగస్టు 21 :**



రవితేజ కథానాయకుడిగా, శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కిన ‘ఇరుముడి’పై విడుదలకు ముందే మంచి అంచనాలు ఏర్పడ్డాయి. కుటుంబ భావోద్వేగాలు, ఉత్కంఠభరిత అంశాలతో రూపొందిన ఈ చిత్రం ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. సీలేరు ప్రాంతంలో ఆటో నడుపుతూ, అరటిపళ్ల వ్యాపారం చేసుకునే త్రినాథ్ తన భార్య, కూతురితో ఆనందంగా జీవిస్తుంటాడు. అయితే పదో తరగతి చదువుతున్న ఓ విద్యార్థిని అనూహ్యంగా మృతి చెందడంతో అతని కుటుంబం జీవితంలో ఊహించని పరిణామాలు చోటుచేసుకుంటాయి. ఆ మరణం వెనుక అసలు కారణమేంటి? అనేది కథలో ప్రధాన అంశంగా సాగుతుంది. కుటుంబ అనుబంధాలు, నేర పరిశోధన, భావోద్వేగాలను దర్శకుడు శివ నిర్వాణ సమర్థంగా మేళవించారు. ద్వితీయార్థంలో కొంత నెమ్మదించినా.. ప్రీ క్లైమాక్స్, క్లైమాక్స్ బలంగా ఉండటంతో సినిమా ప్రభావం పెరుగుతుంది.



# మూకుతి అమ్మన్ 2 లో రెజీనా విలన్!

**చెన్నై, ఆగస్టు 21 :**

నయనతార ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న ‘మూకుతి అమ్మన్ 2’పై భారీ అంచనాలు నెలకొన్నాయి. సుందర్ సి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో నటి రెజీనా కసాండ్రా కీలక పాత్రలో కనిపించనున్నట్లు కోలీవుడ్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అంతేకాదు.. ఆమె ప్రతినాయక పాత్రలో నటించనున్నట్లు సమాచారం. రెజీనా పాత్రను దర్శకుడు సుందర్ సి ప్రత్యేకంగా తీర్చిదిద్దినట్లు తెలుస్తోంది. నయనతారకు దీటుగా సాగే ఈ పాత్ర కథలో కీలకంగా ఉండనుందని సమాచారం. దీంతో నయనతార, రెజీనా మధ్య పోరాటం ఎలా ఉండబోతుందనే ఆసక్తి ప్రేక్షకుల్లో పెరుగుతోంది. రూ.100 కోట్లకు పైగా భారీ బడ్జెట్‌తో చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు సమాచారం. తొలి భాగంతో పోలిస్తే ఇందులో దృశ్య ప్రభావాలు, అద్భుత అంశాలు, యాక్షన్ సన్నివేశాలను మరింత భారీగా రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. వెల్స్ ఫిల్మ్ ఇంటర్నేషనల్ పతాకంపై డాక్టర్ ఇషారి కె. గణేష్ నిర్మిస్తున్నారు. ‘అరణ్మనై’ చిత్రాలతో అద్భుత అంశాలు, హారర్, వినోదాన్ని తెరకెక్కించడంలో గుర్తింపు తెచ్చుకున్న సుందర్ సి.. ‘మూకుతి అమ్మన్ 2’ను కూడా భారీ వినోదాత్మక చిత్రంగా రూపొందిస్తున్నట్లు సమాచారం.



# భాగ్యశ్రీ బోర్సేపై బాలీవుడ్ వార్తలకు చెక్

**హైదరాబాద్, ఆగస్టు 21 :**

టాలీవుడ్ యువ కథానాయిక భాగ్యశ్రీ బోర్సేకు సంబంధించిన బాలీవుడ్ వార్తలపై తాజాగా స్పష్టత వచ్చింది. బాలీవుడ్ నటుడు ఆదిత్య రాయ్ కపూర్, దర్శకుడు మిలాప్ జవేరీ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న భారీ ప్రేమకథా చిత్రంలో భాగ్యశ్రీ కథానాయికగా ఎంపికైందంటూ కొంతకాలంగా ప్రచారం జరిగింది. అయితే ఈ వార్తలను నిర్మాణ సంస్థ టీ-సిరీస్ ప్రతినిధులు ఖండించారు. ఈ సినిమాలో భాగ్యశ్రీ కథానాయికగా నటిస్తోందన్న ప్రచారంలో ఎలాంటి నిజం లేదని టీ-సిరీస్ స్పష్టం చేసింది. చిత్రంలో కథానాయికగా ఎవరు నటించనున్నారనే విషయాన్ని త్వరలోనే అధికారికంగా వెల్లడిస్తామని తెలిపింది. దీంతో ఆదిత్య రాయ్ కపూర్ సరసన భాగ్యశ్రీ నటించనుందన్న వార్తలకు తెరపడింది. ఆదిత్య రాయ్ కపూర్, మిలాప్ జవేరీ కలయికలో రూపొందనున్న ఈ చిత్రంపై ఇప్పటికే ఆసక్తి నెలకొంది. ప్రేమ, యాక్షన్, భావోద్వేగాల మేళవింపుతో సినిమాను తెరకెక్కించనున్నట్లు తెలుస్తోంది. మిలాప్ జవేరీ గతంలో పలు ప్రేమకథా చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్నారు. భాగ్యశ్రీ బోర్సే రవితేజ నటించిన ‘మిస్టర్ బచ్చన్’తో కథానాయికగా తెలుగు చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టింది. అనంతరం దుల్కర్ సల్మాన్, రానా దగ్గుబాటి తదితరులు నటించిన ‘కాంత’ చిత్రంలోనూ కనిపించింది. అక్కినేని అఖిల్ నటించిన ‘లెనిన్’ చిత్రంలో కథానాయికగా నటించింది. ప్రస్తుతం శివ కార్తికేయన్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న మరో చిత్రంలోనూ భాగ్యశ్రీ నటిస్తోంది.



# పల్లె కథలకు ప్రేక్షకుల పట్టం

**హైదరాబాద్, ఆగస్టు 21:**

తెలుగు సినిమాల్లో ప్రస్తుతం గ్రామీణ నేపథ్య కథల హవా కొనసాగుతోంది. మన ఊరు, మనుషులు, సంస్కృతి, సంప్రదాయాలు, స్థానిక జీవన విధానాన్ని ప్రతిబింబించే కథలకు ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. ఈ నేపథ్యంలో పల్లె కథలను తెరపై చూపించడంపై వస్తున్న విమర్శలపై నిర్మాతలు సుప్రియ యార్లగడ్డ, వివేక్ కృష్ణాని స్పందించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎలా జీవిస్తున్నారు? వారి సంస్కృతి, సంప్రదాయాలు, భావోద్వేగాలు ఎలా ఉంటాయి? అనే అంశాలను సినిమాల్లో చూపించడం సృజనాత్మక ప్రక్రియలో భాగమేనని వారు తెలిపారు. పల్లెటూరి వాతావరణాన్ని, అక్కడి ప్రజల జీవితాలను నిజాయితీగా చూపించడంలో తప్పేమీ లేదన్నారు. విమర్శలు వస్తున్నాయని కథలను మార్చుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ప్రేక్షకులు కేవలం భారీ హంగులు, గ్లామర్ కోసం మాత్రమే సినిమాలు చూడటం లేదని, తమ జీవితాలకు దగ్గరగా ఉండే సహజమైన కథలను కూడా ఆదరిస్తున్నారని పేర్కొన్నారు. కథలో కొత్తదనం, నిజాయితీ ఉంటే అది ఏ ప్రాంతంలో జరిగినా ప్రేక్షకులకు తప్పకుండా చేరువవుతుందని తెలిపారు. గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిన పలు సినిమాలు విజయవంతం కావడం ఇందుకు నిదర్శనమని నిర్మాతలు అన్నారు. ప్రాంతీయ సంస్కృతి, జీవన విధానాన్ని తెరపైకి తీసుకువచ్చినప్పుడు కొన్ని విమర్శలు రావడం సహజమేనని, అయితే వాటి కారణంగా తమ సృజనాత్మక స్వేచ్ఛను పరిమితం చేసుకోబోమని స్పష్టం చేశారు. భవిష్యత్తులోనూ విభిన్నమైన, సహజమైన కథలను ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తామని తెలిపారు.

“This newspaper/periodical is published by KALIDINDI SUMALATHA from 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA - 500020. on behalf of **RS USAR PUBLICATIONS**, edited by RAGHURAMA RAJU KALIDINDI and printed by **KALIDINDI SUMALATHA** at **KING DIGITAL OFFSET PRINTERS**, 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA – 500020. **PRGI NO: TGTEL/26/A2948,** Email: rsusarp@myyahoo.com, 9849350555, 9515121467